మా కలం - సామాన్యుడి బలం
# నంది పత్రిక
జాతీయ తెలుగు దిన పత్రిక
RNI-APTEL/2023/88162
GSTIN 37AMRPM5719R1ZX





## ఆసియా క్రీడల కబడ్డీలో భారత్ గోల్డెన్ డబుల్..

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 259 | ఆదివారం 27 - 09 -2026 | పేజీలు : 12 | వెల-3

# విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం'..

**ఈ నెల 30న విజయవాడలో ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ**
**24,057 కుటుంబాలకు సంపూర్ణ యాజమాన్య హక్కులు**
**రూ.9800 కోట్ల విలువైన భూములపై పేదలకు అధికారం**
**దశాబ్దాల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన కూటమి ప్రభుత్వం**
**8 నియోజకవర్గాల్లోని లబ్దిదారులకు ప్రయోజనం**

2లో



పేదలకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించే బృహత్తర కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా నగరవాసులను వేధిస్తున్న ఇళ్ల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక ముందడుగు వేసింది. విశాఖపట్నంలో ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమ స్ఫూర్తితో, ఇప్పుడు విజయవాడలో భారీ ఎత్తున ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీకి సిద్ధమైంది. ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 24,057 కుటుంబాలకు సంపూర్ణ హక్కులతో కూడిన పట్టాలను




గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందించేందుకు సమగ్ర రక్షిత తాగునీటి పథకాల నిర్వహణ, పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర రక్షిత మంచి నీటి పథకాల నిర్వహణపై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సీపీడబ్ల్యూఎస్ (జ్రూబో) పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి పథకం పరిశుభ్రంగా, సురక్షితంగా, పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**1.65 కోట్ల మందికి తాగునీటి సరఫరా** ప్రస్తుతం రాష్ట్రంలో 512 సీపీడబ్ల్యూఎస్ పథకాల ద్వారా 11,221 నివాస ప్రాంతాలకు తాగునీటి సరఫరా జరుగుతోందని, సుమారు 1.65 కోట్ల మంది ప్రజలు ఈ పథకాలపై ఆధారపడి ఉన్నారని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ అధికారులు, జెడ్పీ సీఈవోలు సంయుక్తంగా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.




# తెలంగాణ టూరిజానికి ఏఐ బూస్ట్..

**అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం**
**డిజిటల్ టెక్నాలజీతో పర్యాటక రంగానికి కొత్త రూపు**
**పీపీపీ విధానంలో పెట్టుబడులు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం**

2లో

తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ టెక్నాలజీ సహాయంతో రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త ఊపు తీసుకురావాలని సూచించారు. తెలంగాణలోని ప్రకృతి, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదను ప్రపంచ పర్యాటక పటంలో ప్రత్యేక గుర్తింపు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం2026 వేడుకలు శనివారం హైదరాబాద్‌లోని శిల్పారామం సంప్రదాయ వేదికలో ఘనంగా నిర్వహించారు. "డిజిటల్ అజెండాఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు" అనే

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయం

**హైదరాబాద్‌లో మాజీ ప్రధాని విగ్రహావిష్కరణ.. సీఎం రేవంత్‌రెడ్డి నివాళి**
**ఆర్థిక సంస్కరణల రూపశిల్పి ఆయన..**
**భారత రత్న ఇవ్వాలని డిమాండ్**

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ భారతదేశం గర్వించదగ్గ జాతిరత్నమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతోనే మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నామని తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చారని కొనియాడారు.

**ఆర్థిక సంస్కరణలకు నాంది పలికిన నేత** 2లో





## అక్టోబర్ 4న తెలంగాణకు అమిత్ షా?

- కరీంనగర్‌లో ప్రత్యేక కార్యక్రమానికి హాజరుకానున్నట్లు సమాచారం,
- కేంద్ర హోంమంత్రి పర్యటనపై రాజకీయ వర్గాల్లో చర్చ,
- పర్యటన ఏర్పాట్లపై అధికారుల దృష్టి,
- కార్యక్రమ వేదిక, సమయంపై అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపు,
- కేంద్రం నుంచి స్పష్టత వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం

2లో

# కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం



**ఏవియేషన్ సెంటర్ ను ప్రారంభించిన ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ**
**పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరుగుతుందన్న మంత్రి**
**ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేయబోతున్నట్టు బీసీ జనార్దన్ ప్రకటన**

2లో

రాష్ట్రంలోనే ప్రప్రథమంగా కర్నూలు ఎయిర్‌పోర్టులో ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్ అందుబాటులోకి రావడం చరిత్రాత్మకమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు విమానాశ్రయం వేదికగా ఈరోజు 'ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ' ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్,

## భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం..



**భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష**
**వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం పంపిణీకి ఆదేశం**
**ప్రకాశం బ్యారేజీకి ఎగువ, దిగువన కొత్త బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలు**
**తాజా వర్షాలతో రాష్ట్రంలోని జలాశయాల్లోకి 21 టీఎంసీల అదనపు నీరు**
**రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గుదల**

# హిందువులంటే జగన్‌కు గిట్టదు..

**ప్రకాశం జిల్లాలో వైఎస్సార్ విగ్రహం ఘటనపై దీపక్ రెడ్డి ఆగ్రహం**
**హిందువులంటే జగన్‌కు పడదనేందుకే ఈ ఘటనే నిదర్శనమని వ్యాఖ్యలు**
**శుభసూచకమైన పసుపు రంగు అంటే వైసీపీకి గిట్టదని విమర్శ**



వైసీపీ అధినేత జగన్ కు హిందువులన్నా, హిందూ సంప్రదాయాలన్నా గిట్టదని, అందుకే ప్రకాశం జిల్లాలో వైఎస్సార్ విగ్రహంపై పసుపు రంగు పడిందంటూ ఫేక్ ప్రచారం చేస్తున్నారని సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి తీవ్రస్థాయిలో

## కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?

**ఓటర్ల జాబితా సవరణపై జగన్ ది ద్వంద్వ వైఖరి అంటూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఫైర్**
**గతంలో కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటమేంటని ప్రశ్న**
**ఈసీల నియామకంపై మాట మార్చడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీత**
**2029లో కాంగ్రెస్‌తో పొత్తు కోసమే జగన్ వ్యూహాలని ఆరోపణ**



వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్‌ది అవకాశవాద, ద్వంద్వ వైఖరి అని ఆరోపిస్తూ సోషల్ మీడియా వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు. ఆయన రాజకీయ సౌలభ్యం కోసం వైఖరులు మార్చుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఇప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్, గతంలో

## విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం'..

అందించనున్నారు. విజయవాడలో ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన అజెండాగా మారుతున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి సర్కార్ చరమగీతం పాడుతోంది. దశాబ్దాల క్రితం అందించిన ఎన్టీఆర్ పట్టాలకు చట్టబద్ధత కల్పిస్తూ, వాటిపై లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులను కట్టబెడుతోంది. ఈ కార్యక్రమం ద్వారా సుమారు రూ. 9,800 కోట్ల విలువైన 617 ఎకరాల భూమిపై పేద, మధ్య తరగతి కుటుంబాలకు అధికారం లభించనుంది. దీనివల్ల ఒక్కో కుటుంబానికి సుమారు రూ. 40 లక్షల నుంచి రూ. 45 లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. ముఖ్యంగా, విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలో కొండలపై ఇళ్లు నిర్మించుకున్న వారి చిరకాల స్వప్నం ఈ కార్యక్రమంతో నెరవేరబోతోంది. తమ ఇళ్లకు శాశ్వత భద్రత, భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కొండ ప్రాంత నివాసితులు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశంలోనూ ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం వేగంగా స్పందించి, ఇప్పుడు 29.86 లక్షల చదరపు గజాల స్థలంపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తోంది. క్రమబద్ధీకరణ చేస్తున్న భూముల మార్కెట్ విలువ దాదాపు రూ. 24,297 కోట్లుగా ఉంటుందని అంచనా. ఈ పట్టాల పంపిణీ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు, కృష్ణా జిల్లాలోని గన్నవరం సహా మొత్తం 8 నియోజకవర్గాల్లోని 15 మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీలు 12,093, ఓసీలు 6,130, ఎస్సీలు 4,546, ముస్లిం బీసీలు 955, ఎస్టీలు 333 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నాయి.

## తాగునీటి నాణ్యతపై పవన్ కళ్యాణ్ ఫోకస్

నీటి వనరులు, శుద్ధి కేంద్రాలు, పంప్‌హౌస్‌లు, ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, పైప్‌లైన్లు, వాల్వుల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**ఫిల్టర్ బెడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి** తాగునీటి నాణ్యతను కాపాడటంలో ఫిల్టర్ బెడ్ల నిర్వహణ కీలకమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఫిల్టర్ హౌస్‌లను అత్యంత పరిశుభ్రంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఫిల్టర్ బెడ్లలోకి కప్పులు, బల్లులు, ఎలుకలు, పాములు, ఇతర కీటకాలు ప్రవేశించకుండా అన్ని ఓపెనింగ్‌లకు రక్షణ వలలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వెంటిలేటర్లు, ఓవర్‌ఫ్లో పైపులు, డ్రెయిన్ అవుట్‌లెట్లకు తుప్పు పట్టని మెష్ స్క్రీన్లు అమర్చాలని సూచించారు. అలాగే శుద్ధి చేసిన నీటిని భౌతిక, రసాయన, బ్యాక్టీరియాలజికల్ ప్రమాణాల ప్రకారం క్రమం తప్పకుండా పరీక్షించాలని తెలిపారు. నీటి నాణ్యతలో ఏవైనా లోపాలు గుర్తిస్తే వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.నీటి వనరులు, వాటి పరిసర ప్రాంతాలను కాలుష్య రహితంగా ఉంచాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. వేసవి నిల్వ ట్యాంకులను పూర్తి సామర్థ్యంతో నిర్వహించడంతో పాటు వాటి కట్టలను బలోపేతం చేయాలని సూచించారు. జంతువులు, పశువులు, ఇతర కాలుష్య కారకాలు నీటి వనరుల్లోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లీకేజీలు, విద్యుత్ సమస్యలు, మౌలిక వసతుల లోపాలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

**రికార్డులు పక్కాగా నిర్వహించాలి** ప్రతి సీపీడబ్ల్యూఎస్ పథకానికి సంబంధించిన నిర్వహణ రికార్డులు, తనిఖీ నివేదికలు, మరమ్మతుల వివరాలను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పంచాయతీ అభివృద్ధి అధికారులు నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పర్యవేక్షించి, పరీక్షల ఫలితాలను వాటర్ క్వాలిటీ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నిర్దేశిత ప్రమాణాలు పాటించిన తర్వాతే చెల్లింపులను సిఫారసు చేయాలని స్పష్టం చేశారు. గ్రామీణ కుటుంబాలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీటి సరఫరా అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పవన్ కళ్యాణ్ తెలిపారు. తాగునీటి నాణ్యత, ప్రజారోగ్యం, భద్రత, నిరంతర సరఫరాకు సంబంధించిన అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రాష్ట్రంలోని ప్రతి గ్రామీణ కుటుంబానికి నమ్మకమైన తాగునీటి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## అక్టోబర్ 4న తెలంగాణకు అమిత్ షా?

కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబర్ 4న తెలంగాణకు రానున్నట్లు సమాచారం. ఆయన కరీంనగర్‌లో నిర్వహించనున్న ఓ ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.అమిత్ షా తెలంగాణ పర్యటన నేపథ్యంలో కరీంనగర్‌లో కార్యక్రమ ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సంబంధిత అధికారులు దృష్టి సారించే అవకాశం ఉంది. కేంద్ర హోంమంత్రి పర్యటన నేపథ్యంలో బీజేపీ శ్రేణుల్లోనూ ఆసక్తి నెలకొంది.అయితే అక్టోబర్ 4న కరీంనగర్ పర్యటనకు సంబంధించి పూర్తి అధికారిక కార్యక్రమ వివరాలు, వేదిక, సమయం తదితర అంశాలు ఇంకా స్పష్టంగా వెల్లడికాలేదు. కేంద్ర ప్రభుత్వం లేదా సంబంధిత అధికారిక వర్గాల నుంచి తుది షెడ్యూల్ వెలువడిన తర్వాత పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అమిత్ షా పర్యటన ఖరారైతే కరీంనగర్‌లో జరిగే కార్యక్రమం, భద్రతా ఏర్పాట్లు, పార్టీ నాయకులతో సమావేశాలు తదితర అంశాలపై మరింత సమాచారం వెలువడే అవకాశం ఉంది.

## కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం

ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ సిరి, స్థానిక ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కేఈ శ్యామ్ బాబుతో పాటు అకాడమీ చైర్మన్ ఆనంద్ జాకబ్ వర్గీస్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడిన మంత్రి జనార్దన్ రెడ్డి... ఓర్వకల్లులో అత్యాధునిక హంగులతో 'డ్రోన్ సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. దీన్ని రెండు దశలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తొలి విడతలో 180 ఎకరాల్లో, ఆ తర్వాత రెండో దశలో మరో 400 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. గతంలో 2017లో కర్నూలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పునాదిరాయి వేసి, అతి తక్కువ కాలంలోనే దానిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశామని జనార్దన్ రెడ్డి గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ఏవియేషన్ సెక్టార్‌లో ప్రొఫెషనల్స్, పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరగనుందని తెలిపారు. ఈ కొత్త ట్రైనింగ్ సెంటర్ ద్వారా కర్నూలు జిల్లా యువతతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు విమానయాన రంగంలో నిపుణులుగా శిక్షణ పొందే సువర్ణావకాశం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం..

గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం అందించాలని ఆదేశించారు. అదే సమయంలో కృష్ణా నదిపై రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు.శనివారం జరిగిన ఈ సమీక్షలో అధికారులు రాష్ట్రంలోని తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్రలో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, పలుచోట్ల నివాస ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. సహాయక చర్యలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఐదు రోజులుగా సముద్రంలోకి వెళ్లలేని మత్స్యకారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి అండగా నిలవాలని, తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

**కృష్ణాపై కొత్త బ్యారేజీలు.. నీటి భద్రతపై దృష్టి** ఈ సందర్భంగా స్థానికంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పెరుగుతోందని అధికారులు తెలపగా, ఆ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే మార్గాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య ఒకటి, ప్రకాశం బ్యారేజీకి దిగువన మరొకటి చొప్పున రెండు కొత్త బ్యారేజీల నిర్మాణం అవసరమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే, హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించి, వంశధార నీటిని రిజర్వాయర్‌లోకి తరలించే పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు.

**నిండిన జలాశయాలు.. తగ్గిన వర్షపాతం లోటు** తాజా వర్షాల వల్ల రాష్ట్రంలోని 29 ప్రధాన రిజర్వాయర్లలోకి భారీగా నీరు వచ్చి చేరినట్లు ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. సెప్టెంబర్ 23 నాటికి 101 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ, కేవలం మూడు రోజుల్లో 21 టీఎంసీలు పెరిగి 122 టీఎంసీలకు చేరిందని తెలిపారు. ఒక్క ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల్లోనే సుమారు 5 టీఎంసీల నీరు అదనంగా చేరిందని వివరించారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు. గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రవాహం 1.20 లక్షల క్యూసెక్కుల నుంచి 3.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. వంశధారపై గొట్టా బ్యారేజీకి, నాగావళిపై నారాయణపురం ఆనకట్టకు కూడా ఇన్‌ఫ్లో రికార్డు స్థాయిలో పెరిగింది.

# తెలంగాణ టూరిజానికి ఏఐ బూస్ట్..

ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా పర్యాటక రంగాన్ని ఆధునికీకరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర పర్యాటకాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లేందుకు డిజిటల్ పరిజ్ఞానం కీలకంగా మారిందని పేర్కొన్నారు. తెలంగాణ టూరిజం పునర్‌రూపకల్పన చేసిన వెబ్‌సైట్, ఆకట్టుకునే చిత్రాలతో రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఆయన ఆవిష్కరించారు.

**హెల్త్, ఆలయ, ప్రకృతి పర్యాటకానికి అపార అవకాశాలు** తెలంగాణలో హెల్త్ టూరిజం, ఆలయ పర్యాటకం, గ్రామీణ పర్యాటకం, ప్రకృతి పర్యాటకానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని భట్టి విక్రమార్క తెలిపారు. వికారాబాద్‌లో వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయని చెప్పారు. రాష్ట్రంలోని టైగర్ రిజర్వులు, దట్టమైన అడవులు, జలపాతాలు, ప్రాచీన దేవాలయాలు, హైదరాబాద్‌లోని చారిత్రక కట్టడాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. వీటిని అంతర్జాతీయ స్థాయిలో సరైన రీతిలో ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**పీపీపీ విధానంలో భారీ పెట్టుబడులకు ప్రణాళిక** పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానాన్ని ప్రోత్సహిస్తామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, మౌలిక వసతులు కల్పించి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గతంతో పోలిస్తే ఈసారి పర్యాటక రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. సందర్శకుల భద్రత, నాణ్యమైన వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

**ఐటీ ఉద్యోగులకు టూరిజం కూపన్లు** వారంలో ఐదు రోజులు ఒత్తిడితో పనిచేసే హైదరాబాద్ ఐటీ ఉద్యోగులను తెలంగాణలోని పర్యాటక ప్రాంతాల వైపు ఆకర్షించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక శాఖ మంత్రి, అధికారులు ఐటీ కంపెనీల సీఈవోలు, పర్యాటక ప్రాజెక్టుల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. వారాంతాల్లో ఉద్యోగులు ప్రకృతి ప్రాంతాలను సందర్శించేలా 'టూరిజం కూపన్లు' అందించే ఆలోచనను పరిశీలించాలని తెలిపారు. పర్యాటకం కేవలం వినోదం మాత్రమే కాదని.. వివిధ సంస్కృతులు, సంప్రదాయాలను కలిపే వేదిక అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**కొత్త కార్యక్రమాలకు శ్రీకారం** ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తెలంగాణ పర్యాటక శాఖ పలు నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. పర్యాటకులకు మరింత మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో పునర్‌రూపకల్పన చేసిన తెలంగాణ టూరిజం వెబ్‌సైట్, ఆన్‌లైన్ హోమ్‌స్టే రిజిస్ట్రేషన్ విధానం, కొత్త టూరిజం ట్రైలర్లు, ఏఆర్/వీఆర్ ఆధారిత లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రారంభించారు. అలాగే తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్, "మై తెలంగాణ.. మై స్టోరీ.. మై డెస్టినేషన్" అంశంపై వీడియో/పోస్టర్, ఎకో టూరిజానికి సంబంధించిన ప్రత్యేక వీడియోలను ఆవిష్కరించారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ తెలంగాణ పర్యాటకాన్ని ప్రపంచ స్థాయిలో ప్రచారం చేయడమే ఈ కార్యక్రమాల లక్ష్యమని అధికారులు తెలిపారు.

**ఏఎస్ఐతో అవగాహన ఒప్పందం** పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) సూపరింటెండెంట్ నిఖిల్ దాస్, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ పురావస్తు శాఖ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది.ఈ సందర్భంగా ఏఐ అండ్ డిజిటల్ టెక్నాలజీది ఫ్యూచర్ ఆఫ్ టూరిజం, ఎకో టూరిజం, ఫిల్మ్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం, హెరిటేజ్ టూరిజం అంశాలపై ప్యానెల్ చర్చ నిర్వహించారు. టూరిజం క్లబ్‌ల విద్యార్థులు, టూరిస్ట్ పోలీసులు,

తెలంగాణ దర్శిని ప్రతినిధులు, శిక్షణ పొందిన గైడ్లు, హోమ్‌స్టే నిర్వాహకులు తమ అనుభవాలను పంచుకున్నారు. తర్వాత పర్యాటక రంగంలో ప్రతిభ కనబరిచిన వారికి ఎక్సలెన్స్ అవార్డులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, టీజీపీఏ డైరెక్టర్ లక్ష్మి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, సినీ నటులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయం

1991లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మన్మోహన్ సింగ్.. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేలా కీలక నిర్ణయాలు తీసుకున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్‌పీజీ) విధానాలను అమలు చేసి భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ చూపిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని తెలిపారు. ఆయన తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగానే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయ్యిందన్నారు.దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న అనేక సంస్థలు హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి సేవలు అందిస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. అలాంటి ప్రాంతంలో ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సముచితమని భావించామని తెలిపారు.

**తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర** హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసి స్వాతంత్ర్యం అందించడంలో తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని రేవంత్‌రెడ్డి అన్నారు. దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను సాకారం చేసిన ఘనత సోనియా గాంధీ, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లుపై మన్మోహన్ సింగ్ చేసిన సంతకాన్ని ఇక్కడ పొందుపరిచామని తెలిపారు.

**ప్రజా సంక్షేమ చట్టాలకు ప్రాధాన్యం** మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో అనేక ప్రజా సంక్షేమ విధానాలు అమల్లోకి వచ్చాయని సీఎం తెలిపారు. విద్యా హక్కు చట్టం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, భూసేకరణ, పునరావాస చట్టం2013 వంటి కీలక చట్టాలు తీసుకురావడంలో ఆయన ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందన్నారు. భూమిలేని పేదలకు కూడా నష్టపరిహారం అందేలా పునరావాస చట్టం ద్వారా హక్కులు కల్పించారని పేర్కొన్నారు.

**మౌనంగా దేశాన్ని ముందుకు నడిపిన నేత** మౌనమునిలా దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించిన గొప్ప నాయకుడు మన్మోహన్ సింగ్ అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన సేవలను గుర్తించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కొన్ని సందర్భాల్లో రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరుతున్నామని తెలిపారు. అలాగే ఢిల్లీలో మన్మోహన్ సింగ్ పేరుతో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లేలా లోక్‌సభ సభ్యులు పార్లమెంట్‌లో ప్రస్తావించాలని సూచించారు. మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ముఖ్యమంత్రిగా ఆవిష్కరించడం తనకు గర్వకారణమని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆలోచనలు, విధానాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## కవైసీ పేరుతో సైబర్ మోసం..

### రూ.30 వేలు స్వాహా

### బ్యాంకు ఖాతా బ్లాక్ అవుతుందంటూ మెసేజ్..

### లింక్ క్లిక్ చేసి నష్టపోయిన వ్యక్తి

### అనుమానాస్పద లింకులు క్లిక్ చేయొద్దని పోలీసుల హెచ్చరిక

బ్యాంకు కేవైసీ అప్‌డేట్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి ఖాతా నుంచి రూ.30 వేలు స్వాహా చేసిన ఘటన మంథని పట్టణంలో చోటుచేసుకుంది. బ్యాంకు ఖాతా కేవైసీ పెండింగ్‌లో ఉందని, వెంటనే అప్‌డేట్ చేయకపోతే ఖాతా బ్లాక్ అవుతుందని వచ్చిన నకిలీ వాట్సాప్ సందేశాన్ని నమ్మిన బాధితుడు సైబర్ మోసానికి గురయ్యాడు. మంథని పట్టణానికి చెందిన దేనవేన రమేష్‌కు శనివారం సాయంత్రం యూనియన్ బ్యాంక్ లోగోతో కూడిన ఓ వాట్సాప్ సందేశం వచ్చింది. "మీ ఖాతాకు సంబంధించిన కేవైసీ పెండింగ్‌లో ఉంది.. వెంటనే అప్‌డేట్ చేయకపోతే ఖాతా నిలిపివేయబడుతుంది" అంటూ వచ్చిన హెచ్చరికతో కూడిన మెసేజ్‌ను చూసి రమేష్ ఆందోళనకు గురయ్యాడు.మెసేజ్‌లో ఉన్న లింక్‌పై క్లిక్ చేయడంతో సైబర్ నేరగాడు అతడికి ఫోన్ చేసి మరొక లింక్ పంపించాడు. అందులో వివరాలు నమోదు చేయాలని సూచించాడు. దీంతో రమేష్ అతడి మాటలు నమ్మి ఏటీఎం కార్డు నంబర్, సీవీవీ, పిన్ నంబర్ వంటి వివరాలను తెలియజేశాడు.కొద్ది నిమిషాల్లోనే రమేష్ బ్యాంకు ఖాతా నుంచి రూ.30 వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో తాను సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన రమేష్ వెంటనే అప్రమత్తమై 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం దర్యాప్తు చేపట్టారు.

**బ్యాంకులు ఎప్పుడూ లింకులు పంపవు** కేవైసీ అప్‌డేట్, ఖాతా బ్లాక్ అవుతుందనే పేరుతో వచ్చే మెసేజ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. బ్యాంకులు ఎప్పుడూ వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా లింకులు పంపి వివరాలు అడగవని స్పష్టం చేశారు. ఎవరైనా బ్యాంకు పేరుతో లింకులు పంపితే వాటిని క్లిక్ చేయవద్దని, ఏటీఎం పిన్, సీవీవీ, ఓటీపీ వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద సందేశాలు లేదా సైబర్ మోసాలకు సంబంధించిన ఘటనలు ఎదురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

## ఆహార భద్రతలో నిర్లక్ష్యం.. ప్రముఖ రెస్టారెంట్ల లైసెన్సులు రద్దు

హైదరాబాద్‌లోని ప్రముఖ రెస్టారెంట్లలో ఆహార భద్రత ప్రమాణాలపై తెలంగాణ ఫుడ్ సేఫ్టీ (టీజీ సేఫ్) ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు కొరడా ఝుళిపించాయి. మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లోని 20 ప్రముఖ రెస్టారెంట్లలో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా.. పలు చోట్ల తీవ్ర అపరిశుభ్రత, బొద్దింకలు, ఎలుకల సంచారం, గడువు ముగిసిన ఆహార పదార్థాల నిల్వలు బయటపడ్డాయి. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనలు ఉల్లంఘించిన హోటళ్లపై అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. మొత్తం 11 హోటళ్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను సస్పెండ్ చేసి కార్యకలాపాలను నిలిపివేశారు. మరికొన్ని హోటళ్లకు షోకాజ్, ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు.

**వంట గదుల్లో అపరిశుభ్రత** తనిఖీల్లో పలు రెస్టారెంట్ల వంట గదుల్లో పరిశుభ్రత లోపాలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల బొద్దింకలు, ఎలుకల సంచారం కనిపించడంతో పాటు వాటి వల్ల ఆహార పదార్థాలు కలుషితమయ్యే పరిస్థితులు ఉన్నట్లు గుర్తించారు. ఆహార నిల్వ విధానాల్లోనూ లోపాలు బయటపడ్డాయి. గడువు ముగిసిన పదార్థాలు, సరైన లేబులింగ్ లేని ఆహార పదార్థాలు, పాడైపోయిన కూరగాయలు నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించారు.

**పలు ప్రముఖ హోటళ్లపై చర్యలు** నిబంధనలు పాటించని కారణంగా మోనాస్టరీ, అల్ సబా, లక్కీ రెస్టారెంట్, సాయిరామ్ మెస్, ఉడుపి ఉపహార్, అమ్ ఆహా, ఫ్యూజన్ 9 తదితర హోటళ్లపై చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హోటల్ అవాస, మినర్వా గ్రాండ్ తదితర సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేయగా.. రామేశ్వరం కేఫ్, షాదాబ్, షాగౌస్ సహా ఆరు రెస్టారెంట్లకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు ఇచ్చారు. అనుమానిత ఆహార పదార్థాల నుంచి నమూనాలను సేకరించి పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపినట్లు అధికారులు తెలిపారు.

**తనిఖీల్లో వెలుగుచూసిన లోపాలు** టీజీ సేఫ్ బృందాల తనిఖీల్లో కొన్ని రెస్టారెంట్లలో బొద్దింకలు, ఎలుకల తీవ్ర సమస్య, పాడైపోయిన, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, సరైన లేబులింగ్ లేకపోవడం, ఆహార నిల్వల్లో నిబంధనల ఉల్లంఘన, కిచెన్ పరిశుభ్రత లోపాలు, పెస్ట్ కంట్రోల్ రికార్డులు లేకపోవడం, ఫుడ్ హ్యాండ్లర్ల ఆరోగ్య రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వంటి అంశాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

## హిందువులంటే జగన్‌కు గిట్టదు..

విరుచుకుపడ్డారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రకాశం జిల్లా ఉమామహేశ్వరపురంలో వైఎస్సార్ విగ్రహంపై పసుపు పడిందనే నెపంతో, ఒక టీడీపీ నాయకుడిని బెదిరించి, బలవంతంగా విగ్రహాన్ని నీటితో కడిగించి, దాన్ని వీడియో తీసి వైసీపీ నేతలు రాక్షసానందం పొందారని ఆయన మండిపడ్డారు."హిందువులు శుభకార్యాలకు ప్రతీకగా భావించే పసుపు రంగు అంటే వైసీపీ నాయకులకు ఎందుకంత కోపం? విగ్రహంపై పసుపు పడితే, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి గానీ, దారికాచి ఒక వ్యక్తిని బెదిరించి ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణం. ఇది కేవలం ఒక టీడీపీ నాయకుడిపై జరిగిన దాడి కాదు, యావత్ హిందూ సమాజంపై జరిగిన దాడిగా పరిగణించాలి" అని దీపక్ రెడ్డి వ్యాఖ్యానించారు. వైసీపీ నేతల ఇలాంటి దౌర్జన్యపూరిత ప్రవర్తనను చూసే 2024 ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఘోరంగా ఓడించారని, అయినా వారిలో మార్పు రాలేదని విమర్శించారు. భవిష్యత్తులోనూ ఇదే వైఖరి కొనసాగిస్తే పార్టీ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని హెచ్చరించారు.

**వైసీపీ హయాంలో ఆలయాలపై దాడులు** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో హిందువుల మనోభావాలను దెబ్బతీసే అనేక సంఘటనలు జరిగాయని దీపక్ రెడ్డి గుర్తుచేశారు. "శ్రీశైలం నుంచి రామతీర్థం వరకు దాదాపు 300 దేవాలయాలపై దాడులు జరిగాయి. అంతర్వేది రథం దగ్ధం నుంచి రామతీర్థంలో రాముడి విగ్రహ శిరస్సు ఖండన వరకు ఎన్నో దుశ్చర్యలకు పాల్పడ్డారు. అయినా బాధ్యులైన ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. అప్పటి మంత్రి కొడాలి నాని సైతం విగ్రహాల ధ్వంసంపై బాధ్యతారహితంగా మాట్లాడారు" అని దుయ్యబట్టారు.

తిరుమల పవిత్రతను సైతం మంటగలిపారని దీపక్ రెడ్డి ఆరోపించారు. బస్సు టికెట్ల వెనుక అన్యమత ప్రచార వాక్యాలు, టీటీడీ వెబ్‌సైట్‌లో అశ్లీల చిత్రాలు, అధిక ధరలతో భక్తులను దేవుడికి దూరం చేసే కుట్ర చేశారని విమర్శించారు. పరకామణిలో జరిగిన దొంగతనాన్ని జగన్ చిన్నదిగా అభివర్ణించడం, వైవీ సుబ్బారెడ్డి భార్య ఆధ్వర్యంలో 'జగన్మోహక రక్షక' అంటూ అన్యమత ప్రార్థనలు చేయించడం వంటి ఘటనలు హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయని అన్నారు. వైసీపీ నేతలు ఇప్పటికైనా తమ పద్ధతి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు.

## 10 శాతం వృద్ధి సాధ్యమే: టెక్నాలజీపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

దేశ ఆర్థిక వృద్ధి రేటు 10 శాతం మార్కును అధిగమించాలంటే అన్ని రంగాల్లోనూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతిక విభాగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారానే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని ఆమె స్పష్టం చేశారు. బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.సాంకేతికత ఆధారంగా వివిధ రంగాల్లో మరిన్ని అంకుర సంస్థలు ఆవిర్భవించాలని ఆమె పిలుపునిచ్చారు. నూతన సాంకేతికతలను ప్రజలు సులభంగా అందిపుచ్చుకునేలా నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేవలం దిగ్గజ సంస్థలకే పరిమితం కాకుండా, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) సైతం ఏఐ వినియోగం గణనీయంగా పెరగాలని ఆమె ఆకాంక్షించారు. దేశ మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధిలో తదుపరి దశకు చేరుకోవాలంటే అన్ని విభాగాల్లోనూ డిజిటల్ వ్యవస్థలకు పెద్దపీట వేయాలని నిర్మలా సీతారామన్ వివరించారు. ఈ ఆధునిక సాంకేతిక రంగాలకు తగిన ప్రోత్సాహం అందిస్తే, దేశ భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.



# “పోలీసు అంటే భయం కాదు.. ప్రజలకు భరోసా కల్పించాలి”...!!







**క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వంతో విధులు నిర్వహించాలి**

**దీక్షాంత్ పరేడ్ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత**

**యూనిఫాం గౌరవంతో పాటు బాధ్యతను కూడా ఇస్తుంది: జిల్లా కలెక్టర్**

**ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలి: జిల్లా ఎస్పీ**

**శిక్షణ పూర్తి చేసుకున్న 521 మంది నూతన కానిస్టేబుళ్లకు, సిబ్బందికి అభినందనలు**

**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబరు 26 నంది పత్రిక** పోలీసు విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, ధైర్యం, మానవత్వం ఎంతో కీలకం. పోలీసు యూనిఫాం ప్రజలకు భరోసా కల్పించేలా పనిచేయాలి. పోలీసు- అంటే భయం కాదు.. ప్రజలకు భరోసా అనే భావన ప్రజల్లో కలిగేలా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలి” అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్ కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత నూతన పోలీసు కానిస్టేబుళ్లకు పిలుపునిచ్చారు. బాకరాపేటలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ పోలీసు పరేడ్ మైదానంలో శనివారం 521 మంది నూతనంగా శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసు కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జి మంత్రి సవిత హాజరుకాగా, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల నుంచి మంత్రి గౌరవ వందనం స్వీకరించారు. ఈ దీక్షాంత్ పరేడ్ కార్యక్రమంలో తొమ్మిది నెలల ప్రాథమిక శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 521 మంది కానిస్టేబుళ్లు ఈ పరేడ్‌లో పాల్గొన్నారు. వీరిలో కడప పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన 194 మంది సివిల్ ఎస్‌సీటీపీసీలు, 11వ బెటాలియన్‌కు చెందిన 327 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

**పోలీసు వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నెముక : మంత్రి సవిత**

పోలీసు వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నెముక అని అన్నారు. దీక్షాంత్ పరేడ్ కేవలం ఒక పరేడ్ మాత్రమే కాదు.. శిక్షణార్థి నుంచి బాధ్యతాయుతమైన పోలీసు సిబ్బందిగా మారే కీలక ఘట్టం అన్నారు. క్రమశిక్షణ, సమన్వయం, ఆత్మవిశ్వాసం, విధి పట్ల అంకితభావాన్ని చాటిన నూతన కానిస్టేబుళ్లు ఇకపై ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించనున్నారు. సుమారు 6 వేల మంది కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో అనేక అడ్డంకులను అధిగమించి నియామకాలు చేపట్టామని మంత్రి సవిత తెలిపారు. శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లకు ఇచ్చే నెలవారీ స్టైపెండ్‌ను రూ.4,500 నుంచి రూ.12 వేలకు పెంచామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 21 శిక్షణా కేంద్రాల్లో సుమారు 5,800 మంది కానిస్టేబుళ్లు శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. పోలీసులు చట్టాన్ని గౌరవిస్తూ, ప్రతి ఒక్కరినీ సమానంగా చూస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, బలహీన వర్గాల రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పోలీసు సిబ్బంది ప్రజల సమస్యలను ఓపికగా విని, మానవీయ దృక్పథంతో స్పందించాలన్నారు. ఉపాధ్యాయులపై కొందరు దుష్ప్రచారం చేయడం, వారి వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ అవమానకరంగా మాట్లాడటం వల్ల వారు తీవ్రంగా బాధపడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడడంతోపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు, సాంకేతిక ఆధారిత నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వంటి కొత్త సవాళ్లు పోలీసుల ముందున్నాయని మంత్రి అన్నారు. అందువల్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతోపాటు కొత్త చట్టాలపై నిరంతరం అవగాహన పెంచుకోవాలని సూచించారు. కాలానుగుణంగా.. పరిణతి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అలవర్చుకోవాలన్నారు. పోలీసు యూనిఫారంలో తన బిడ్డను చూడాలని, సమాజాన్ని రక్షించడంలో తమబిడ్డ కూడా ఒక బృహత్తర బాధ్యతను నిర్వహించేలా ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. పౌరుషాలకు, ప్రేమాభిమానాలకు, ప్రాణాలకు ప్రాణాలు ఫణంగా పెట్టె స్వభావం ఉన్న ఈ రాయలసీమ గడ్డపై.. 11వ బెటాలియన్ లో ఉన్నతమైన ఆశయాలతో, ప్రజల్లో రక్షణపై విశ్వాసాన్ని నపుతున్న సమగ్రమైన దీక్షణను అందిస్తున్న పోలీసు అధికారులకు సగర్వంగా అభినందనలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో రాష్ట్ర ప్రభుత్వం పోలీసు రక్షణ రంగం పటిష్టత కోసం రూ.9.165 కోట్లు బడ్జెట్ ను కేటాయించిందన్నారు. అలాగే సమాజంలో నిరంగతర రక్షణ కల్పన దిశగా ఈగల్ వింగ్, ప్రత్యేకంగా మహిళలు, చిన్నారుల ఆత్మ రక్షణ కోసం “శక్తి“ యాప్ ని సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలో పోలీసు శాఖను మరింత దృఢతరం చేసే ఉద్దేశ్యంతో, సమాజ శ్రేయస్సు కోసం రక్షణ రంగంలో అడుగిడాలనుకునే యువతకు ఉద్యోగ అవకశాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 6050 పోస్టులను విడుదల చేసి... మరో రెండువేల అదనపు ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్థులను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అలాగే.. పోలీసు కుటుంబాల శ్రేయద్దు కోసం పోలీసు బీమా సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.

**యూనిఫాం గౌరవంతో పాటు బాధ్యతను కూడా ఇస్తుంది: కలెక్టర్**

నూతన కానిస్టేబుళ్లకు దీక్షాంత్ పరేడ్ ఒక కొత్త బాధ్యతాయుతమైన ప్రయాణానికి శ్రీకారం చుడుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. తొమ్మిది నెలల కఠిన శిక్షణ అనంతరం నేడు ప్రజాసేవలోకి అడుగుపెడుతున్న ప్రతి కానిస్టేబుల్ తన విధి పట్ల అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. “పోలీసు యూనిఫాం గౌరవాన్ని మాత్రమే కాదు.. గొప్ప బాధ్యతను కూడా ఇస్తుంది. మీరు చేసే ప్రతి పని పోలీసు శాఖ ప్రతిష్ఠతో ముడిపడి ఉంటుంది. ప్రజలతో మర్యాదగా, నిష్పక్షపాతంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలి. బాధితులకు అండగా నిలిచి, చట్టాన్ని కాపాడుతూ ప్రజలకు భద్రత కల్పించాలి” అని కలెక్టర్ సూచించారు. సమాజంలో రక్షణ శాఖ ద్వారా సహాయం కోరేవారు చాలా మంది ఉంటారని.. పోలీసుశాఖపై వారికున్న నమ్మకాన్ని, రక్షణ, సాయం చేస్తారని మీపై పెట్టుకున్న విశ్వాసాన్ని కొమ్ము చేయకుండా.. సమాజ సేవ చేయడానికి.. ప్రభుత్వం మీకందిస్తున్న గొప్ప అవకాశాన్ని ప్రతి యువ పోలీసు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం సమాజంలో ఎంతోమంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి బాధ్యులవుతున్నారని.. అలాంటి వారికి సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ.. నేరాల నుండి అమాయక ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను పోలీసు యంత్రాంగం గౌరవప్రదంగా స్వీకరించాలని సూచించారు. సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీసులు నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. “క్రమశిక్షణతో విధి.. నిజాయితీతో సేవ.. మానవత్వంతో ప్రజలకు రక్షణ” అనే స్ఫూర్తితో పనిచేయాలని నూతన కానిస్టేబుళ్లకు పిలుపునిచ్చారు.

**ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలి: జిల్లా ఎస్పీ** జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ... 9 నెలల శిక్షణ పూర్తి చేసుకుని పోలీసు విధుల్లోకి అడుగుపెడుతున్న నూతన కానిస్టేబుళ్లు శిక్షణలో నేర్చుకున్న క్రమశిక్షణ, సమయపాలన, శారీరక దారుఢ్యం, విధి నిర్వహణ నైపుణ్యాలను సేవలో కొనసాగించాలని సూచించారు. “ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన బాధ్యత. పోలీసు యూనిఫారం అనేది కేవలం ఒక గుర్తింపు మాత్రమే కాదు. ప్రతి పరిస్థితిలో సంయమనంతో వ్యవహరిస్తూ చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలి. ప్రజలతో మర్యాదగా వ్యవహరించి వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి. మీ విధి నిర్వహణలో నిజాయితీ, అంకితభావం, ధైర్యం ఎప్పుడూ ముందుండాలి” అని ఎస్పీ సూచించారు. నేరాల స్వభావం మారుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు, సాంకేతిక పరిజ్ఞానం, మాదకద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై నిరంతరం అవగాహన పెంచుకోవాలని తెలిపారు. పోలీసు సేవలో ప్రతి రోజు కొత్తగా నేర్చుకునే అవకాశమేనని, ప్రజా సేవను గర్వంగా భావించి విధులు నిర్వర్తించాలని సూచించారు.

**అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి పురస్కారాలు..**

దీక్షాంత్ పరేడ్ సందర్భంగా శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కానిస్టేబుళ్లకు మంత్రి సవిత, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పురస్కారాలు అందజేసి అభినందించారు. అనంతరం నూతన కానిస్టేబుళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 11వ బెటాలియన్ కమాండెంట్ ఆనంద్ రెడ్డి, కడప డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్, పోలీసు అధికారులు, జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నత అధికారులు, వివిధ కేటగిరీలకు చెందిన పోలీసు, బెటాలియన్ సిబ్బంది, శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ పిఆర్వో వెంకట్ యాదవ్ వ్యాఖ్యాతగా వ్యవహరించి కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా సాగించారు.







## మైదుకూరులో వైఎస్సార్‌సీపీ ఫోటో ఐడీ కార్డుల పంపిణీ



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 26**, మైదుకూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఖాజీపేట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఫోటో ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, పంచాయతీ, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దుగ్గిరెడ్డి మురళి మోహన్ రెడ్డి కోరారు.

## ఏళ్ల నాటి త్రాగునీటి సమస్యకు పరిష్కారం.

**-డోన్ ఎంఎల్ఎ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి.**





**బేతంచెర్ల సెప్టెంబర్ 26( నందిపత్రిక ).** బేతంచెర్ల మండలం ఆర్. బుక్కాపురం గ్రామ పరిధిలో గత 20 సంవత్సరాల నుండి ( ఆర్ఎస్ రంగాపురం రైల్వే స్టేషన్ దగ్గర )20 కుటుంబాలు స్థిర నివాసం ఏర్పరచుకొని నివాసం ఉంటున్నారు. ఈ కాలనీ ప్రజలుచాలా ఏండ్ల త్రాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎన్నో ఏళ్ల నుండి త్రాగునీరు కొరకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని ఆర్.బుక్కాపురం గ్రామ టిడిపి నాయకులు, ప్రజలు,డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డికి, డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ విషయం పై స్పందించిన ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి , బోర్ వేయించడం జరిగింది. 3 ఇంచుల నీళ్లు పడటంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు నీటి సమస్యను తెలియజేసిన వెంటనే, స్పందించి, నీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి కి కాలనీవాసులు ప్రత్యేక ధన్య వాదములు తెలియ జేశారు.

## చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతి వేడుకలు



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 26** ఖాజీపేట, ఖాజీపేటలో కవి, సూక్ష్మ నిర్మాణాల కళాకారుడు షేక్ హాజీ గౌస్ ఆధ్వర్యంలో ప్రముఖ తెలుగు రచయిత, నాటకకర్త, సంఘసంస్కర్త చిలకమర్తి లక్ష్మీనరసింహం 159వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం గయోపాఖ్యానం, గణపతి, కీచకవధ వంటి రచనలతో తెలుగు సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు పొందారని, సామాజిక సంస్కరణలు, విద్య, గ్రంథాలయ ఉద్యమాలకు కృషి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో రచయిత షేక్ ఇంతియాజుద్దీన్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ, ఓబుల్ రెడ్డి, ఈ. మొహమ్మద్ హుస్సేన్, లక్ష్మిరెడ్డి, బొమ్మలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలు

**నిర్వహించిన నవజీవన్ బధిరుల పాఠశాల**

**బధిరులు తమ వైకల్యాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో జీవితంలో ఎదగాలి: డాక్టర్ రవి కృష్ణ.**

**ఆకట్టుకున్న బధిర బాలల సాంస్కృతిక ప్రదర్శనలు**



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 26 ( నంది పత్రిక )** శనివారం స్థానిక అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న నవజీవన్ బధిరుల ప్రత్యేక పాఠశాల లో అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నవజీవన్ బధిరుల పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జాన్ మేరీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు, లయన్స్ అంతర్జాతీయ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బధిర బాలలు తమ వైకల్యాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో జీవితంలో విజయాలు సాధించాలని కోరారు. చదువుతోపాటు క్రీడల్లో,సాంస్కృతిక కళలలో పాల్గొని విజయాలు సాధించాలని, బధిరుల కోసం జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అనేక క్రీడా పోటీలు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు దివ్యాంగులకు జీవితంలో పైకి ఎదగడానికి ప్రస్తుతం అన్ని రకాల తోడ్పాటు అందిస్తున్నారని,రాష్ట్ర ప్రభుత్వం 6000 రూపాయల నెలవారీ పెన్షన్ అందించడమే కాకుండా, ప్రత్యేక విద్యాసంస్థలు నెలకొల్పుతున్నారని, ఉద్యోగాలలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించి ప్రోత్సహిస్తున్నారని , స్వచ్ఛంద సంస్థలు వారు విజయం సాధించడంలో సహాయ సహకారాలు అందించడానికి ముందుకు వస్తున్నారని, బధిర విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి సంవత్సరం క్రీడా పరికరాలు అందించడమే కాకుండా అవసరమైన ఇతర సహాయ సహకారాలను నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం, లయన్స్ క్లబ్, ఐఎంఏ తరఫున అందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా బధిర బాలలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాట, సంగీతం వినిపించక పోయినప్పటికీ, సంగీతానికి అనుగుణంగా, డాన్స్ టీచర్ సంజ్ఞలతొ ఇచ్చే సూచనలతో చక్కటి నృత్య ప్రదర్శనలు చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో నవజీవన్ పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జాన్ మేరీ, హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మావతమ్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఇతర అధ్యాపక బృందం పాఠశాలలో చదువుకుంటున్న బధిర బాలలు పాల్గొన్నారు.



# అంగన్ వాడి వర్కర్స్ పై పని భారం తగ్గించాలి

**రూరల్ ప్రాంతంలో పనిచేస్తున్న వారికి సామాజిక పింఛన్లు ఇవ్వాలి**

**సమాన పనికి సమాన వేతనం నెలకు 32000 జీతం అమలు చేయాలి**

**ఏఐటీయూసీ, సీఐటీయూ**

**జే లలితమ్మ, పి నిర్మల**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న అంగన్వాడి వర్కర్స్ పై రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా కర్నూలు జిల్లాలో పని భారం పెంచుతున్నారని ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే లలితమ్మ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి నిర్మల విమర్శించారు. శనివారం నాడు కలెక్టరేట్ ముందు ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రెండు సంఘాల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ ధర్నా కార్యక్రమానికి చాందిని, దర్గమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జె.లలితమ్మ పి. నిర్మలమ్మ మాట్లాడుతూ నెలకు 11,500తో జీతంతో పనిచేస్తున్న అంగన్వాడి వర్కర్స్ పై కర్నూలు జిల్లాలో అధికారులు రోజుకి 8 ఫోటోలు అప్లోడ్ చేయాలని పని భారం పెంచడం తగదని చిన్నచిన్న కారణాలతో మెమోలిస్తూ అంగన్వాడి వర్కర్స్ పై వేధింపులు గురి చేస్తున్నారని ఆరోపించారు.

అర్బన్ ప్రాంతంలో అంగన్వాడి వర్కర్స్ కు సామాజిక పింఛన్లు ఇస్తున్నారని రూరల్ ప్రాంతంలో ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా నిత్యవసర ధరలు, ఇంటి అద్దెలు పిల్లల చదువుల ఫీజులు పెరుగుతున్న అంగన్వాడి వర్కర్స్ జీతాలు పెరగడం లేదని అరాకొర జీతాలతో జీవనం ఎలా కొనసాగిస్తారని అన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం నెలకు 32 వేల రూపాయలు కనీస వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చే సంక్షేమ పథకాలన్నీ కూడా అంగన్వాడి వర్కర్స్ కు వర్తింపచేయాలని, పని భారం పెంచే యాప్స్ తొలగించాలని డిమాండ్ చేశారు. చర్చించి పని భారం తగ్గిస్తాం అంగన్వాడీ వర్కర్స్ పై పని భారం పెరిగిందని దీన్ని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్న నేపథ్యంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పిడి విజయ ధర్నా దగ్గరకు వచ్చి డిమాండ్ తో కూడిన వినతి పత్రం తీసుకొని అధికారులతో చర్చించి పని భారం తగ్గిస్తానని తగ్గిస్తామని, మిగిలిన సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



ఈ ధర్నా కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చౌడేశ్వరి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ మునెప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ధనలక్ష్మి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, అంగన్వాడి వర్కర్స్ కాంతమ్మ,సుజాత సంధ్యారాణి, విజయలక్ష్మి, వీరమ్మ శారద, ఏఐటీయూసీ నాయకులు రామాంజనేయులు సిఐటియు నాయకులు నాగేష్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# శుభకార్యాల్లో కాంక్రీట్ స్టాండ్లనే వాడాలి

**షామియానాల కోసం రహదారులపై గుంతలు తవ్వితే కఠిన చర్యలు**

**మున్సిపల్ చట్టాల ప్రకారం భారీ జరిమానాల విధింపు**

**క్షేత్రస్థాయిలో మున్సిపల్ యంత్రాంగం నిత్యం తనిఖీలు**

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరిక**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలో వివాహాలు, నిశ్చితార్థాలు, గృహప్రవేశాలు, పూజా కార్యక్రమాలు, జన్మదిన వేడుకలు, ఇతర శుభకార్యాలను నిర్వహించే క్రమంలో షామియానాలు, పందిళ్లు ఏర్పాటు చేసేటప్పుడు రహదారులకు ఎలాంటి నష్టం కలగకుండా కాంక్రీట్ స్టాండ్లను మాత్రమే ఉపయోగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. ఎవరైనా రహదారులపై గుంతలు తవ్వితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. లక్షలాది రూపాయలతో నిర్మించిన రహదారులపై శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల కోసం షామియానాలు ఏర్పాటు చేసేందుకు గుంతలు తవ్వడం, మేకులు కొట్టడం వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఒకసారి రహదారిని తవ్వడం వల్ల ఏర్పడే ప్యాచ్‌ల కారణంగా రోడ్డు నాణ్యత దెబ్బతినడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల రహదారులపై గుంతలు తవ్వడం, మేకులు కొట్టడం వంటి చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా కాంక్రీట్ స్టాండ్లు లేదా రహదారికి నష్టం కలగని ఇతర పద్ధతులను ఉపయోగించి షామియానాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్స్ చట్టం, 1994లోని సెక్షన్ 197తో భారీ జరిమానాలు విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. రహదారికి జరిగిన నష్టానికి నిబంధనల ప్రకారం సంబంధిత ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలతో పాటు కార్యక్రమ నిర్వాహకులు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమాల నిర్వహణ సమయంలో రహదారులకు నష్టం కలగకుండా నిబంధనలు పాటించాలని, క్షేత్రస్థాయిలో మున్సిపల్ యంత్రాంగం నిత్యం తనిఖీలు నిర్వహిస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు.



## పల్లె పండుగ3.0ను విజయవంతం చేయాలి

**కూటమి శ్రేణులకు ఏపీ సీడ్స్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి పిలుపు**



**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 26:** ఈ నెల 29న ఉదయగిరి నియోజకవర్గంలో నిర్వహించనున్న పల్లె పండుగ3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బద్వేల్ నియోజకవర్గ జనసమీకరణ పరిశీలకులుగా వ్యవహరిస్తున్న సుబ్బారెడ్డి శుక్రవారం బద్వేల్‌లో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సూర్యనారాయణరెడ్డి ఆదేశాల మేరకు మండలాల వారీగా కూటమి ముఖ్య నాయకులు, జనసమీకరణ పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. బద్వేల్ మున్సిపాలిటీ, బద్వేల్ రూరల్, గోపవరం, అట్లూరు, కలసపాడు, బి.కోడూరు, అవధూత కాశీనాయన, పోరుమామిళ్ల మండలాల నుంచి కార్యక్రమానికి హాజరయ్యే జనసమీకరణపై సమీక్షించారు.ప్రతి మండలానికి నిర్దేశించిన జనసమీకరణ లక్ష్యానికి అనుగుణంగా ప్రజలను వాహనాల్లో కార్యక్రమానికి తరలించే బాధ్యతను నాయకులు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ప్రజలను తరలించే సమయంలో అవసరమైన జాగ్రత్తలు పాటిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సుబ్బారెడ్డి కోరారు. ఈ సమావేశంలో జనసమీకరణ పరిశీలకులు నరసింహులు, మహబూబ్ కాశీం, బద్వేల్ నియోజకవర్గానికి చెందిన కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# ఘనంగా పోలీస్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్.







**కర్నూలు ఏపీఎస్పీ 2వ బెటాలియన్ లో 430 ఏపీఎస్పీ ట్రైనీ పోలీసులకు , కర్నూలు డిటిసిలో 199 ఏపీఎస్పీట్రైనీ పోలీసులకు మొత్తం 629 మంది ఎపిఎస్పీ కానిస్టేబుళ్ల శిక్షణ అనంతరం పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహణ .**

**ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం & ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ గుప్తా**

**శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం .**

**ప్రజల్లో నమ్మకం పెరగాలి.**

**ట్రైనీ పోలీసులను ఉద్దేశించి మాట్లాడిన మంత్రి టి.జి. భరత్ గుప్తా**

**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ నేరాల నియంత్రణకు కృషి చేయాలి.**

**ఉత్తమ ప్రతిభ కనబరిచిన ట్రైనీలు, శిక్షకులకు ప్రశంసా పత్రాలు, అవార్డుల ప్రదానం చేసిన ... మంత్రి టి. జి భరత్ గుప్తా**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలుఎపిఎస్పీ బెటాలియన్ లో 430 మంది, కర్నూలు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో 199 మందికి కలిపి కర్నూలు ఎపిఎస్పీ 2 బెటాలియన్ పరేడ్ మైదానంలో 2025-26 బ్యాచ్‌కు చెందిన మొత్తం 629 ఎపిఎస్పీ ట్రైనీ కానిస్టేబుళ్ల కు 9 నెలల శిక్షణ అనంతరం శనివారం పాసింగ్ అవుట్ పరేడ్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక కర్నూలు ఏపీఎస్పీ 2వ బెటాలియన్ గ్రౌండ్‌లో సంయుక్తంగా నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం , ఆహార శుద్ధి శాఖ మంత్రివర్యులు టి.జి. భరత్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై పరేడ్ గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్ కమాండర్ ఆధ్వర్యంలో శిక్షణార్థులు ప్రదర్శించిన లయబద్ధమైన కవాతు, మార్చ్ పాస్ట్ విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం శిక్షణ కాలంలో వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి టి.జి. భరత్ గుప్తా మాట్లాడుతూ తొమ్మిది నెలల శిక్షణ తర్వాత కానిస్టేబుళ్లు ప్రదర్శించిన పరేడ్ చాలా బాగా చేశారన్నారు. శిక్షణను పకడ్బందీగా పర్యవేక్షించిన శిక్షకుల కృషిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు.పోలీసు శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టేలా కానిస్టేబుళ్లు సేవా దృక్పథంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. అసాంఘిక శక్తులు, రౌడీ మూకల గుండెల్లో పోలీసుల పేరు వింటేనే చట్టంపై భయం కలగాలని, అదే సమయంలో సామాన్య పౌరులు ప్రశాంతంగా జీవించేలా రక్షణ కల్పించాలన్నారు. ప్రస్తుత కాలంలో సాంకేతికత వేగంగా మారుతోందని, ప్రభుత్వం సమకూరుస్తున్న కృత్రిమ మేధస్సు (ఏ ఐ ), సీసీటీవీ నెట్‌వర్క్, వాహనాల కదలికల విశ్లేషణ వంటి ఆధునిక సాధనాలను సద్వినియోగం చేసుకొవాలన్నారు.

నేర పరిశోధన, నిందితుల గుర్తింపును మరింత వేగవంతం చేయాలన్నారు.సరికొత్త ఆలోచనలతో నిరంతరం తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు.ఎంతో నమ్మకంతో పిల్లలను దేశసేవకు, పోలీసు వృత్తికి అంకితం చేసిన తల్లిదండ్రుల త్యాగం వెలకట్టలేనిదని, వారి ఆశయాలను నిలబెడుతూ శాఖకు, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వం నిరుద్యోగ యువత సంక్షేమానికి కట్టుబడి ఉందని, భవిష్యత్తులో క్రమం తప్పకుండా పోలీసు రిక్రూట్‌మెంట్ చేపట్టి కొత్త ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. ఎపిఎస్పీ రెండవ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఐపియస్ మాట్లాడుతూ ఈ తొమ్మిది నెలల శిక్షణలో భాగంగా ట్రైనీ సిబ్బందికి ఆధునిక పోలీసింగ్‌కు అవసరమైన వివిధ అంశాల్లో సమగ్ర శిక్షణ అందించామన్నారు.వివిధ విభాగాల్లో అవార్డులు సాధించిన వారి వివరాలు ఎపిఎస్పీ బెటాలియన్ లో టాపర్లు:బెస్ట్ ఆల్ రౌండర్ మరియు బెస్ట్ ఇండోర్ : నందికం శ్రీనివాసులు

**బెస్ట్ అవుట్‌డోర్:** ముప్పూరి ప్రశాంత్

బెస్ట్ ఫైరర్: పరస తరుణ్ కుమార్

పరేడ్ కమాండర్: అంకె నంద కుమార్

**డిటిసి శిక్షణలో టాపర్లు:**

బెస్ట్ ఆల్ రౌండర్ మరియు బెస్ట్ ఇండర్: చప్పటి రోహిత్

బెస్ట్ అవుట్‌డోర్ : లక్కింశెట్టి మహేష్

బెస్ట్ ఫైరర్స్: వెంకట సాయి కృష్ణారెడ్డి

అసది శివ శంకర్ ఈ కార్యక్రమంలో ఉత్తమ డ్రిల్ ఇన్‌స్ట్రక్టర్ల కు కూడా ప్రశంస పత్రాలు , అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపియస్, జిల్లా కలెక్టర్ డా. ఎ.సిరి ఐఏయస్ , కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ . ఎపిఎస్పీ 2 బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఐపియస్ , అడిషనల్ ఎస్పీ అడ్మిన్ (డిటిసి ప్రిన్సిపాల్) జి. హుస్సేన్ పీరా, అడిషనల్ కమాండెంట్ నాగేంద్ర రావు, అసిస్టెంట్ కమాండెంట్లు డి. వెంకట రమణ, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్, డీటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి. దుర్గా ప్రసాద్, డిఎస్పీలు, సిఐలు, ఇతర పోలీసు అధికారులు, శిక్షణ సిబ్బంది, ట్రైనీ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పోషకాహారం తిందాం ఆరోగ్యంగా ఎదుగుదాం

**త్రివర్ణ కాలనీ అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి ఉత్సవం**




**డోన్, సెప్టెంబర్ 26 నంది పత్రిక** త్రివర్ణ కాలనీ అంగన్వాడి సెంటర్01లో శనివారం అంగన్వాడి ఉత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లలో లభించే వివిధ పోషక పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రోటీన్లు పిల్లల ఎదుగుదలకు, కండరాల అభివృద్ధికి అవసరమని, విటమిన్లు రోగనిరోధక శక్తి పెంపుతో పాటు కంటి చూపు, శరీర ఆరోగ్యానికి దోహదపడతాయని తెలిపారు. అలాగే ఇనుము, కాల్షియం, పీచు పదార్థాలు, కార్బోహైడ్రేట్లు శరీరానికి అందించే ప్రయోజనాలను వివరించారు. ప్రతిరోజూ సమతుల్యమైన, వైవిధ్యమైన పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లులు, పిల్లలు ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ కె. కవితాబాయి, ఆయా తహరునిసాబీ, ఆశా కార్యకర్తలు శాంత, కృష్ణవేణితో పాటు గర్భిణులు, బాలింతలు, 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లల తల్లులు, 3 నుంచి 6 సంవత్సరాల పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## నాయుని చెరువుల గిరిజనులకు తాగు నీటి సౌకర్యం ఏర్పాటు





**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 26:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్నెపాడు గ్రామానికి సమీపంలో ఉన్న నాయుని చెరువు చెంచుగూడెం లో గిరిజనులకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. ఈనెల 21న ఐ టి డి ఏ అధికారులు నాయిని చెరువులో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులు తమ గోడును వెల్లబోసుకున్నారు. గూడెంలో చాలా రోజుల నుండి బోర్లు మరమ్మతుకు నోచుకోవడం లేదని, దీనివల్ల తాగునీటికి తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు అధికారులు దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై స్పందించిన అధికారులు వెంటనే బోర్లను మరమ్మతు చేస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి, ఈర్నపాడు పంచాయతీ కార్యదర్శి హసన్ బోర్ల రిపేర్ విషయంలో దృష్టి సారించారు. కాలనీలో రెండు చేతి బోర్లకు మరమ్మతులు చేయించారు. ఒక బోరులో భూగర్భ జలాలు అటుగంటి పోవటంతో అదనంగా పైపులు తెప్పించి బోరుకు బిగించి ఏర్పాటు చేశారు. కాలనీలో మరో మోటార్కు కూడా మరమ్మతులు చేయించారు. బోర్లన్నీ మరమ్మతు చేయించడంతో గిరిజనులకు తా గునీటి సౌకర్యానికి ఏర్పడిన ఇబ్బందులు తొలగిపోయాయి. ఈ విషయంలో స్పందించి బోర్లను మరమ్మత్తులు చేయించిన, అధికారులకు గిరిజన పుత్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదిలా ఉండగా నెమ్మల్ల కుంటలో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టినట్లు డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. గూడెంలో గడ్డి మందు పిచికారి చేసి పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

## సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం.

**అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు**

**పోలింగ్ కేంద్రాల ప్రతిపాదిత ముసాయిదాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల ప్రతిపాదిత ముసాయిదాపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపిన సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని, వాస్తవ పరిస్థితులు, సాధ్యాసాధ్యాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేసి తుది జాబితాను ప్రచురిస్తామని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శనివారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.పోలింగ్ కేంద్రాల ప్రతిపాదిత ముసాయిదాను రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ప్రతినిధులు వ్యక్తం చేసిన సందేహాలను నివృత్తి చేశారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించిన అనంతరం అవసరమైన మార్పులు, చేర్పులు చేసి తుది జాబితాను ప్రచురిస్తామని కమిషనర్ తెలిపారు.కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, డిసిపి శబ్నం శాస్త్రీ, ఏసిపి నాగరాజు, మేనేజర్ జునైద్, సూపరింటెండెంట్ సుబ్బన్న, సి1 రామకృష్ణ, సి3 శ్రీకాంత్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, ఆర్వోలు, ఏఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.




## సేవా సంకల్ప్ అభియాన్2026లో భాగంగా కర్నూలు జీజీహెచ్‌లో మెగా మెడికల్ క్యాంప్

**కర్నూల్ సిటీ నంది పత్రిక** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు సేవా సంకల్ప్ అభియాన్2026 లో భాగంగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శనివారం మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. చిట్టి నరసమ్మ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ మెగా వైద్య శిబిరంలో కార్డియాలజీ, సైకియాట్రీ, మెడికల్ ఆంకాలజీ తదితర అన్ని ప్రధాన వైద్య విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు, నిపుణుల సలహాలు, అవసరమైన చికిత్సా సేవలు అందించారు. వీటితో పాటు బ్లడ్ బ్యాంక్, ఎక్స్‌రే, హెచ్ ఐ వి , ఎన్ టీ ఈ పి , స్లీప్ తదితర ప్రత్యేక సేవలను కూడా ఒకే వేదికపై అందుబాటులో ఉంచారు. ప్రజలకు అవసరమైన వివిధ రకాల వైద్య సేవలను ఒకే చోట అందించడం ద్వారా ఈ శిబిరం ఉపయోగకరంగా నిలిచింది.ఈ సందర్భంగా డి ఎం &హెచ్ ఓ డా. కామేశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ :-ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చని తెలిపారు.కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా. కే. వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ :- ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ఆసుపత్రుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. మెగా మెడికల్ క్యాంప్ ద్వారా ప్రజలకు వైద్య పరీక్షలు, ఆరోగ్య సలహాలు మరియు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ముందస్తు పరీక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎం &హెచ్ ఓ డా కామేశ్వర ప్రసాద్ మరియు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా కె వెంకటేశ్వర్లు తో పాటు రీజనల్ ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా సత్య నారాయణ రెడ్డి , డి సి హెచ్ యస్ డా జఫ్రుల్లా , లేప్రోసి ఆఫీసర్ డా భాస్కర్ మరియు లయేజెన్ ఆఫీసర్స్ మరియు ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే బుడ్డా ను కలిసిన గ్రామ రెవెన్యూ సహాయకులు



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 26:** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ నాయకులు శనివారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. శనివారం బుడ్డా స్వగృహమైన వేల్పనూరు లో గ్రామ రెవెన్యూ సహాయకులు ఈ మేరకు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీశైలం నియోజకవర్గం లోని బండి ఆత్మకూరు మండలానికి చెందిన 57 మంది, మహానంది మండలానికి చెందిన 30 మంది, వెలుగోడు మండలానికి చెందిన 32 మంది, ఆత్మకూరు మండలానికి చెందిన 40 మంది గ్రామ రెవెన్యూ నాయకులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. ముఖ్యంగా గ్రామ రెవెన్యూ సహాయకులకు పేస్కేలు ఇవ్వాలని అర్హత కలిగిన వీఆర్ఏలకు వన్ టైం సెటిల్మెంట్ కింద గ్రామ రెవెన్యూ అధికారులుగా పదోన్నతి ఇవ్వాలని కారుణ్య నియామకం కింద నామినేగా పనిచేస్తున్న వారికి రెగ్యులర్ వీఆర్ఏలుగా గుర్తించాలని కోరారు. తాము గత 11 రోజులుగా సమ్మె చేస్తున్నామని, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కార మార్గానికి కృషి చేయాలని వీఆర్ఏలు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు.

# కర్నూలు రీజినల్ ఐ హాస్పిటల్‌లో ఓ సి టీ యంత్రం ప్రారంభం

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి టీజీ భరత్ గుప్తా



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు రీజినల్ ఐ హాస్పిటల్‌లో డయాబెటిస్‌తో బాధపడుతున్న రోగుల్లో కంటి సంబంధిత సమస్యలను కచ్చితంగా గుర్తించేందుకు ఏర్పాటు చేసిన ఆప్టికల్ కోహెరెన్స్ టోమోగ్రఫీ (ఓ సి టీ ) యంత్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి టీ.జీ. భరత్ ప్రారంభించారు. సీ.డీ.ఎస్ నిధులతో రూ.28.50 లక్షల వ్యయంతో ఈ యంత్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మంత్రి టీ.జీ. భరత్ మాట్లాడుతూ, డయాబెటిస్ కారణంగా కళ్లలో వచ్చే మార్పులను ముందుగానే గుర్తించి చికిత్స అందించడంలో ఓ సి టీ యంత్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఒక్కో పరీక్షకు సుమారు రూ.30 వేల వరకు ఖర్చు అవుతుందని, సంవత్సరంలో పలుమార్లు పరీక్షలు చేయించుకోవాల్సి వస్తే రోగులపై భారీ ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ పరీక్షను ఉచితంగా అందించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు.రీజినల్ ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. సత్యనారాయణ మాట్లాడుతూ, ఓ సి టీ ద్వారా డయాబెటిక్ రోగుల్లో కంటి వెనుక భాగంలో వచ్చే మార్పులను అధునాతన సాంకేతికతతో గుర్తించి, వ్యాధిని ప్రారంభ దశలోనే నిర్ధారించేందుకు వీలుంటుందని తెలిపారు. ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా. కే. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్యశాలల్లో ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి రావడం వల్ల ఖరీదైన పరీక్షలు కూడా ప్రజలకు ఉచితంగా అందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా డయాబెటిస్ రోగులు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరీక్షలు చేయించుకుని, అవసరమైన వైద్య సలహాలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మంత్రి టి జి భరత్ తో పాటు ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా సత్య నారాయణ రెడ్డి , కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా కె వెంకటేశ్వర్లు మరియు హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు పి.టి సాయిప్రదీప్ , డా ప్రవీణ్ మరియు ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక వర్గాల ఓటరు ముసాయిదా జాబితా ప్రచురణ

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను గుర్తించి ముసాయిదా జాబితా రూపొందింపు**

**నగరపాలక, ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాల్లో నోటీసు బోర్డుల్లో జాబితా ప్రదర్శన**

**జాబితాలో అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా తెలియజేయాలి**

**ఎలక్షన్ అడిషనల్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను గుర్తించే ప్రక్రియలో భాగంగా రూపొందించిన ముసాయిదా జాబితాను ఎలక్షన్ అడిషనల్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ప్రచురించారు. స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ముసాయిదా జాబితాను నగరపాలక సంస్థ, ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రజల పరిశీలన కోసం ప్రదర్శించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సామాజిక వర్గాల వారీగా గుర్తించిన ఓటర్ల ముసాయిదా జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు పరిశీలించాలని సూచించారు. జాబితాలో తమ పేరు లేదా వివరాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటలోపు నగరపాలక కార్యాలయంలో లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో డిసిపి శబ్నం శాస్త్రీ, ఏసిపి నాగరాజు, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్, సూపరింటెండెంట్ సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిసిన... కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్‌లో నిర్వహించిన ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడిని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



# ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్వర్ కుమార్ ను తొలగించాలి వామపక్షాల,,డిమాండ్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** వామపక్ష పార్టీలైన సిపిఐ సిపిఎం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ యస్ యు సి ఐ పార్టీల ఆధ్వర్యంలో శనివారం సిపిఐ పార్టీ కార్యాలయం నందు సమావేశం కావడం జరిగినది ఈ సమావేశానికి సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా ఈ సమావేశంలో పాల్గొన్న సిపిఎం సిపిఐ జిల్లా కార్యదర్శులు బి గిడ్డయ్య కామ్రేడ్ గౌస్ దేశాయ్ మాట్లాడుతూ దేశంలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియలో అనేక అవకతవకలు జరిగాయని అర్హులైన ఓటర్లను తొలగించారని తోటీ కమిషనర్లు ఎన్నికల ప్రధాన అధికారి దృష్టికి తీసుకు వచ్చినప్పటికీ ఏమాత్రం తోటి కమిషనర్ల అభిప్రాయాన్ని పరిగణంలో తీసుకోకూడదా ఆర్ఎస్ఎస్ బిజెపి పార్టీలకు తొత్తుగా వ్యవహరిస్తున్న జ్ఞానేశ్ కుమార్ ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఈనెల 26వ తారీకు భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకొని గాంధీ జయంతి అక్టోబర్ రెండో తారీకు వరకు దశలవారీగా ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్వర్ కుమార్ అవినీతి అక్రమాలకు ఒకటే పార్టీకి కొమ్ము కాసే విధానాన్ని విడనాడి తక్షణమే జ్ఞానేశ్వర కుమారును తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28వ తారీకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని అక్టోబర్ రెండో తారీఖున గాంధీ విగ్రహాల ముందు పెద్ద ఎత్తున వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు ఈ మధ్యకాలంలో గోవా రాష్ట్రంలో ఒకటే నియోజకవర్గంలో 95 మంది పేర్లు తొలగించడంతో వారందరూ సుప్రీంకోర్టు ను ఆశ్రయిస్తే గోవా ఎన్నికలకు సుప్రీంకోర్టు డైరెక్షన్ ఇచ్చి మీరందరినీ కూడా ఓటర్ల జాబితాలో చేర్చాలని గోవా ఎన్నికల కమిషనర్ ఆఫీస్ నుండి ఢిల్లీలో ఉన్న ప్రధాన ఎన్నికల కమిషన్ కార్యాలయానికి అనేక దఫాలుగా మెయిల్స్ పెట్టినప్పటికీ రెస్పాన్స్ లేదు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు సర్ విధానాన్ని పలు దపాలు వ్యతిరేకించినప్పటికీ ప్రధాన ఎన్నికల కమిషనర్ స్పందించలేదు తోటి ఎన్నికల అధికారలే సర్ సరిగా లేదని వ్యతిరేకించినప్పటికీ స్పందించకపోవడం శోచనీయం అనేక తప్పులు జరుగుతున్నాయని చెప్పి ఓట్ చోరీ జరిగిందని ప్రతిపక్ష వామపక్ష పార్టీలు చెబుతున్నప్పటికీ ఏమాత్రం కూడా ఎన్నికల కమిషన్ పరిగణంలోకి తీసుకో లేదు ఎన్నికల కమిషన్ ఎన్నిక చేసే విధానాన్ని మార్చాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నారు జ్ఞానేశ్వర్ కుమార్ ను తొలగించాలని చేస్తున్నటువంటి ఆందోళన కార్యక్రమంలో పార్టీలు ప్రజాసంఘాలు ప్రజలు మేధావులు అధిక సంఖ్యలో ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి వెంకటస్వామి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నగర కార్యదర్శి తిరుపాలు వెంకటేష్ ఎస్ యు సి ఐ జిల్లా నాయకులు నాగన్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప సిపిఎం జిల్లా నాయకులు పిఎస్ రాధాకృష్ణ న్యూ నగర కార్యదర్శి రాముడు విశాలాంధ్ర బ్రాంచ్ మేనేజర్ నాగరాజు సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు అన్వర్ భద్ర కుమారు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే తొలగించాలి - సిపిఐ డిమాండ్



**నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 26 . (నంది పత్రిక ):**ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం నంద్యాల పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.రామాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి ఎన్.రంగానాయుడు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కె.రామాంజనేయులు మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన ఓటు హక్కు విషయంలో సీఈసీ అక్రమాలకు పాల్పడ్డారని, బీజేపీ వ్యతిరేక వర్గాల ఓట్లను తొలగించాలనే దుర్బుద్ధితో వ్యవహరించారని మండిపడ్డారు. ముగ్గురు సభ్యుల కమిషన్‌లో మిగిలిన ఇద్దరు కమిషనర్లు పలు సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్, సిపిఐ, సిపిఎమ్‌లతో కూడిన 'ఇండియా' కూటమి పక్షాలు ప్రధాని, హోంశాఖ మంత్రులకు లేఖలు రాసినా స్పందించకపోవడం విచారకరమన్నారు. సీఈసీని తొలగించకుండా కాలయాపన చేస్తే అది ప్రజాస్వామ్యానికి దుర్దినంగా భావించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఈరోజు నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు వారం రోజుల పాటు దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చామని, ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పి.రామచంద్రయ్య మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. గత 10 నెలల కాలంలో తోటి కమిషనర్లు 14 సార్లు తీవ్ర అభ్యంతరాలు తెలిపినా పట్టించుకోకుండా ముందుకు సాగారంటే ఆయనకు ఒక్క నిమిషం కూడా ఆ పదవిలో కొనసాగే అర్హత లేదన్నారు. ఆయన నిర్వాకం కారణంగా దేశంలో దాదాపు 13 కోట్ల మంది అర్హులైన ప్రజలు ఓటు హక్కును కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. మారిన 'ఎస్ఐఆర్' ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, సీఈసీ ఎంపిక ప్రక్రియ కోసం పాత చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, నాగరాముడు, రమేష్ బాబు, ప్రసాద్, భార్గవ్, భాస్కర్, మోట రాముడు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ ఘనంగా జాతీయ పోషణ మాసోత్సవాలు

**వెలుగోడు, సెప్టెంబర్ 26 (నంది పత్రిక):** వెలుగోడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ని అంగన్‌వాడీ కేంద్రంగా శనివారం 9వ జాతీయ పోషణ మాసం2026 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త అనిత బాయి మహిళలు, గర్భిణులకు పోషకాహార ప్రాముఖ్యతను చార్టుల ద్వారా వివరించారు.ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, పండ్లు వంటి పోషకాహారాన్ని రోజువారీ ఆహారంలో తీసుకొని గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించడంతో పాటు తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, తృణధాన్యాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# శాంతిరామ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల క్షేత్ర సందర్శన







## డైస్ చొరవతో 'క్షేత్ర సందర్శన ఆలోచనల సృష్టి' కార్యక్రమం ఏఐసీటీఈ ఆలోచనా ప్రయోగశాల, రోబోటిక్స్ మరియు డ్రోన్ ప్రయోగశాలల్లో విద్యార్థులకు ప్రాయోగిక అవగాహన

**నంద్యాల, సెప్టెంబర్ 26. నంది పత్రిక:**పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కార నైపుణ్యాలు, ప్రయోగాత్మక అభ్యాసం మరియు పారిశ్రామిక దృక్పథాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల స్వయంప్రతిపత్తి ఆధ్వర్యంలో డైస్ చొరవలో భాగంగా 'క్షేత్ర సందర్శన ఆలోచనల సృష్టి' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పాణ్యం ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించి, కళాశాలలోని ఏఐసీటీఈ ఆలోచనా ప్రయోగశాల, రోబోటిక్స్ ప్రయోగశాల మరియు డ్రోన్ ప్రయోగశాలలను పరిశీలించారు. ఈ సందర్శన ద్వారా విద్యార్థులకు పాఠ్యపుస్తకాల్లో నేర్చుకున్న అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి, వాటిని సాంకేతికత మరియు ప్రయోగాత్మక కార్యకలాపాలతో అనుసంధానించుకునే అవకాశం లభించింది.ఏఐసీటీఈ ఆలోచనా ప్రయోగశాలలో ఆవిష్కరణలపై అవగాహన క్షేత్ర సందర్శనలో ప్రధానంగా విద్యార్థులు ఏఐసీటీఈ ఆలోచనా ప్రయోగశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు ప్రయోగశాలలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరికరాలు, నమూనా రూపకల్పనకు అవసరమైన సదుపాయాలు మరియు వివిధ ప్రయోగాత్మక కార్యకలాపాలను విద్యార్థులకు పరిచయం చేశారు.ఒక సమస్యను గుర్తించడం, దాని కారణాలను విశ్లేషించడం, పరిష్కారాన్ని ఆలోచించడం, ఆ ఆలోచనను నమూనాగా రూపొందించడం, ప్రయోగించడం, ఫలితాలను పరిశీలించడం మరియు అవసరమైన మార్పులు చేయడం వంటి దశలతో కూడిన ఆవిష్కరణ ప్రక్రియను విద్యార్థులకు వివరించారు.విద్యార్థులు తమ చుట్టూ ఉన్న రోజువారీ సమస్యలను గుర్తించి, వాటికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సులభమైన మరియు ఉపయోగకరమైన పరిష్కారాలను రూపొందించే విధంగా ఆలోచించాలని అధ్యాపకులు సూచించారు. ఒక చిన్న ఆలోచన కూడా సరైన ప్రయోగాలు మరియు నిరంతర ప్రయత్నం ద్వారా ఉపయోగకరమైన నమూనాగా మారుతుందని వివరించారు.రోబోటిక్స్ ప్రయోగశాల సందర్శన అనంతరం విద్యార్థులు రోబోటిక్స్ ప్రయోగశాలను సందర్శించారు. అక్కడ రోబోట్ల నిర్మాణం, వాటి ప్రధాన భాగాలు, గుర్తింపు పరికరాలు, నియంత్రణ వ్యవస్థలు మరియు ప్రోగ్రామింగ్ విధానాలపై అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.రోబోలు పరిసరాలను ఎలా గుర్తిస్తాయి, అందుకు గుర్తింపు పరికరాలు ఎలా సహాయపడతాయి, నియంత్రణ వ్యవస్థ ద్వారా రోబోను ఎలా నిర్వహిస్తారు, ప్రోగ్రాముల సహాయంతో రోబోకు వివిధ పనులను ఎలా అప్పగించవచ్చో సులభమైన ఉదాహరణలతో వివరించారు.విద్య, పరిశ్రమలు, వ్యవసాయం, వైద్య రంగం, తయారీ రంగం, రవాణా, సేవా రంగాలు మరియు ప్రమాదకర ప్రాంతాల్లో రోబోట్ల వినియోగం గురించి విద్యార్థులకు తెలియజేశారు. రోబోటిక్స్‌ను కేవలం వినోదం కోసం కాకుండా, మానవ శ్రమను తగ్గించడం, ప్రమాదాలను నివారించడం మరియు క్లిష్టమైన పనులను సమర్థవంతంగా నిర్వహించడం వంటి ప్రయోజనాల కోసం ఉపయోగించవచ్చని వివరించారు. విద్యార్థులు రోబోటిక్స్‌కు సంబంధించిన పరికరాలు మరియు నమూనాలను ఆసక్తిగా పరిశీలించి, వాటి పనితీరుపై అధ్యాపకులను ప్రశ్నించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.డ్రోన్ ప్రయోగశాలలో సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యక్ష అవగాహన క్షేత్ర సందర్శనలో భాగంగా విద్యార్థులు డ్రోన్ ప్రయోగశాలను కూడా సందర్శించారు. డ్రోన్ నిర్మాణం, దాని ప్రధాన భాగాలు, మోటార్లు, విద్యుత్ సరఫరా వ్యవస్థ, నియంత్రణ వ్యవస్థ, కెమెరా మరియు ఇతర పరికరాల పనితీరును అధ్యాపకులు వివరించారు.డ్రోన్ గాల్లో ఎలా ఎగురుతుంది, దిశను ఎలా మార్చుకుంటుంది, సమతుల్యతను ఎలా కాపాడుకుంటుంది, నియంత్రణ పరికరం ద్వారా దానిని ఎలా నిర్వహిస్తారు వంటి ప్రాథమిక అంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు.విద్యార్థులకు డ్రోన్ ఎగురవేతకు సంబంధించిన ప్రత్యక్ష ప్రదర్శనను కూడా చూపించారు. డ్రోన్ సాంకేతికతలో భాగంగా భద్రతా నియమాలను పాటించడం, పరిసర పరిస్థితులను గమనించడం మరియు బాధ్యతాయుతంగా సాంకేతికతను వినియోగించడం ఎంతో ముఖ్యమని అధ్యాపకులు వివరించారు.వివిధ రంగాల్లో డ్రోన్ల వినియోగం వ్యవసాయ రంగంలో పంటల పర్యవేక్షణ, వ్యవసాయ భూముల పరిశీలన, పంటల పరిస్థితి అంచనా, భౌగోళిక పటాల తయారీ, చిత్రీకరణ, నిర్మాణ రంగ పర్యవేక్షణ, విపత్తు నిర్వహణ, నిఘా మరియు ఇతర సాంకేతిక అవసరాల్లో డ్రోన్ల వినియోగాన్ని విద్యార్థులకు వివరించారు.ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు లేదా ప్రమాదకర పరిస్థితుల్లో మనుషులు నేరుగా వెళ్లడం కష్టమైన ప్రాంతాలను పరిశీలించేందుకు డ్రోన్లు ఎలా ఉపయోగపడతాయో ఉదాహరణలతో తెలియజేశారు. సాంకేతిక పరిజ్ఞానం సమాజ సమస్యల పరిష్కారానికి ఎలా ఉపయోగపడుతుందో విద్యార్థులకు అవగాహన కల్పించారు.చేసి నేర్చుకునే విధానానికి ప్రాధాన్యత ఈ మొత్తం క్షేత్ర సందర్శనలో 'చేసి నేర్చుకోవడం' అనే విధానానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. విద్యార్థులు కేవలం పరికరాలను చూడటంతో పరిమితం కాకుండా, వాటి పనితీరు, ఉపయోగం మరియు వాటి వెనుక ఉన్న సాంకేతిక సూత్రాలను తెలుసుకునేలా అధ్యాపకులు వివరించారు. ప్రశ్నించడం, పరిశీలించడం, ప్రయోగించడం మరియు సమస్యకు పరిష్కారం కనుగొనడం వంటి విధానాల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం అభివృద్ధి చెందు తుందని అధ్యాపకులు తెలిపారు.విద్యార్థుల్లో సృజనాత్మకతకు ప్రోత్సాహం ఈ సందర్భంగా విద్యార్థులు తమ చుట్టూ ఉన్న సమస్యలను గుర్తించి, వాటికి రోబోటిక్స్, డ్రోన్లు మరియు ఇతర సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి వినూత్న పరిష్కారాలను రూపొందించాలని సూచించారు.ఆలోచనను నమూనాగా మార్చే ప్రక్రియలో బృందపని, పరస్పర సహకారం, సమస్య పరిష్కారం, సృజనాత్మకత, పరిశీలన మరియు నిరంతర అభ్యాసం ఎంతో ముఖ్యమని వివరించారు. భవిష్యత్తులో విద్యార్థులు తమ ఆలోచనలను నమూనాలుగా అభివృద్ధి చేసి, సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులను రూపొందించే దిశగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు.విద్యార్థుల ఉత్సాహభరితమైన పాల్గొనడం పాణ్యం ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు ఏఐసీటీఈ ఆలోచనా ప్రయోగశాల, రోబోటిక్స్ ప్రయోగశాల మరియు డ్రోన్ ప్రయోగశాల సందర్శనలో ఎంతో ఆసక్తిగా పాల్గొన్నారు. వివిధ పరికరాలు, నమూనాలు మరియు సాంకేతిక ప్రదర్శనలను ఆసక్తిగా పరిశీలించారు.విద్యార్థులు రోబోట్ల పనితీరు, డ్రోన్ నిర్మాణం, నియంత్రణ విధానం, ఆలోచనలను నమూనాలుగా మార్చే ప్రక్రియ మరియు సాంకేతికత వినియోగానికి సంబంధించిన అనేక ప్రశ్నలను అడిగారు. కళాశాల అధ్యాపకులు వారి సందేహాలను నివృత్తి చేస్తూ, భవిష్యత్తులో సాంకేతిక రంగంలో మరింతగా నేర్చుకునేందుకు వారిని ప్రోత్సహించారు.ఆవిష్కరణ మరియు పారిశ్రామిక ఆలోచనా సంస్కృతికి పునాది ఈ క్షేత్ర సందర్శన ద్వారా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో ఆవిష్కరణ, సృజనాత్మకత, సహకారం, సమస్య పరిష్కారం, ప్రయోగాత్మక అభ్యాసం మరియు పారిశ్రామిక ఆలోచనా విధానం వంటి నైపుణ్యాలను పెంపొందించేందుకు ఒక మంచి వేదిక ఏర్పడింది.ఏఐసీటీఈ ఆలోచనా ప్రయోగశాల, రోబోటిక్స్ ప్రయోగశాల మరియు డ్రోన్ ప్రయోగశాలల సందర్శన ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకోవడంతో పాటు, తమ ఆలోచనలను భవిష్యత్తులో ఉపయోగకరమైన నమూనాలు మరియు ప్రాజెక్టులుగా అభివృద్ధి చేయాలనే ప్రేరణ పొందారు.విద్యార్థులకు పాఠ్యపుస్తక పరిజ్ఞానంతో పాటు ప్రయోగాత్మక మరియు పరిశ్రమలకు అనుగుణమైన అవగాహన కల్పించడంలో ఇటువంటి క్షేత్ర సందర్శనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా పాఠశాల స్థాయి నుంచే సాంకేతికత, ఆవిష్కరణలు మరియు పారిశ్రామిక ఆలోచనలపై ఆసక్తిని పెంపొందించడం ద్వారా భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే వినూత్న పరిష్కారాలను రూపొందించే దిశగా విద్యార్థులను తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, ప్రయోగశాల సిబ్బంది, నిర్వాహకులు మరియు పాణ్యం ఏపీ మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు సహకరించారు.



# వినాయక సాగర్ ను పరిశీలించిన కమిషనర్ ఎం.జయకృష్ణ



**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 26 నంది పత్రిక** నగరంలోని వినాయక సాగర్ ను నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. వినాయక చవితి నిమజ్జనాల అనంతరం సాగర్ లో పేరుకుపోయిన విగ్రహ శకలాలు, పూల దండలు, ప్లాస్టిక్ వ్యర్థాలను కమిషనర్ పరిశీలించారు. సాగర్ ను యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేయాలని, నీటి నాణ్యతను కాపాడాలని అధికారులను ఆదేశించార్ను, అదే సమయంలో అక్కడ వాకింగ్ కు వచ్చే వాకర్స్ కమిషనర్ ను కలిసి, సాగర్ లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు పాడైపోయాయని, వాటిని మరమ్మతు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్, వెంటనే జిమ్ పరికరాలను పరిశీలించి మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు.కమిషనర్ వెంట డీఈ రమణ మరియు సిబ్బంది ఉన్నారు.



## కేజీబీవీ ప్రిన్సిపాల్ విధుల నుంచి తొలగింపు

**కొత్తపల్లి - నంది పత్రిక :** మండల కేంద్రంలోని కస్తూర్భాగాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ క్రిష్ణాబాయిని విధుల నుంచి పూర్తిగా తొలగించినట్లు జిల్లా విద్యాధికారి జనార్ధన్ రెడ్డి శనివారం ఓ ప్రకటనను వెలువరించారు. ఈనెల 23 వ తేదిన కేజీబీవీ పాఠశాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న భవ్య బాత్రూంలో వాడే కెమికల్ సేవించి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయంపై ప్రిన్సిపాల్ క్రిష్ణాబాయి విధుల పట్ల నిర్లక్ష్యం వహించిందని, పాఠశాలో ఏమి జరుగుతుంది అన్న విషయాలపట్ల అశ్రద్ధగా ఉండడంతో ఆమెను పూర్తిగా విధుల నుంచి తొలించామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి చర్యలు పునారావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.




# కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో ఘనంగా పౌర్ణమి వేడుకలు



**వెలుగోడు సెప్టెంబర్ 26 (నంది పత్రిక):** వెలుగోడు మండలం గుంతకందాల సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆశ్రమానికి చేరుకుని కాశిరెడ్డి నాయన విగ్రహానికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. నామ సంకీర్తనలు, భజనలతో ఆశ్రమ ప్రాంగణం భక్తిమయంగా మారింది. ఆనవాయితీ ప్రకారం నిర్వహించిన ఈ పూజల్లో వెలుగోడు, గుంతకందాల పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నాయనను దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# కర్నూల్ ఎయిర్పోర్టులో ఓరియంట్ ఫ్లైట్ ఏవియేషన్ అకాడమీ కార్యక్రమంలో పాల్గొన్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు




**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు ఎయిర్పోర్ట్ లో ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు బీ.సీ జనార్దన్ రెడ్డి, టీ.జీ భరత్ తో కలిసి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ కర్నూలు విమానాశ్రయంలో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ప్రారంభం ఆంధ్రప్రదేశ్లో విమానయాన రంగ అభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ ప్రాంత యువతకు కొత్త అవకాశాలకు నాంది పలుకుతుందన్నారు...ఆంధ్రప్రదేశ్లో తొలిసారిగా ఎఫ్టీఓ వంటి విమానయాన శిక్షణా సంస్థను ప్రారంభించడం గర్వకారణమన్నారు. కర్నూలు విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన ఎఫ్టీఓ ద్వారా యువతకు విమానయాన రంగంలో శిక్షణ పొందే అవకాశం లభిస్తుందన్నారు. ఇందులో ప్రైవేట్ పైలట్ లైసెన్స్ (పి పి యల్ ), కమర్షియల్ పైలట్ లైసెన్స్ (సి పి యల్ ) వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు... కర్నూలు జిల్లాతో పాటు రాయలసీమ ప్రాంతంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విమానయాన రంగంలో ఆసక్తి ఉన్న యువతకు నాణ్యమైన శిక్షణ అందించడం ద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతున్నాయని, కర్నూలు ప్రాంతంలోని వాతావరణ పరిస్థితులు విమాన శిక్షణకు అనుకూలంగా ఉన్నాయన్నారు. విద్యార్థులకు కేవలం విమాన శిక్షణ మాత్రమే కాకుండా నైతిక, క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. కర్నూలు విమానాశ్రయంలో నైట్ ల్యాండింగ్ సదుపాయం కల్పించాలని రాత్రి వేళల్లో విమానాల రాకపోకలకు అవకాశం కల్పిస్తే కర్నూలు విమానాశ్రయ కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు దోహదపడుతుందని ఎంపీ నాగరాజు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ని కోరారు. అదే విధంగా కర్నూలు విమానాశ్రయాన్ని మరింత ఆధునికంగా, ప్రత్యేక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని కోరారు. హైదరాబాద్బెంగళూరు పారిశ్రామిక కారిడార్లో భాగంగా ఓర్వకల్లు ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ నోడ్గా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఓర్వకల్లు ప్రాంతంలో పారిశ్రామిక, విమానయాన రంగాల అభివృద్ధితో స్థానికంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఎంపీ నాగరాజు పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిరి , పాణ్యం ఎం.ఎల్.ఏ గౌరు చరిత , పత్తికొండ ఎం.ఎల్.ఏ కే.ఈ శ్యామ్ కుమార్ , కోడుమూరు ఎం.ఎల్.ఏ బొగ్గుల దస్తగిరి , ఓరియంట్ ఏవియేషన్ అకాడమీ చైర్మన్ ఆనంద్ జాకబ్ వర్గీస్ పాల్గొన్నారు.

# రేపు "చలో విజయవాడ" కార్యక్రమానికి వెళ్లేందుకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగులకు అనుమతి లేదు.

**ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారుల ఆదేశాలను ఉల్లంఘిస్తే నిబంధనల మేరకు చర్యలు.**

**అనుమతి లేని సామూహిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి.**

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లాకు చెందిన స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగులు (27.09.2026 ఆదివారం) నిర్వహించనున్న "చలో విజయవాడ" కార్యక్రమానికి వెళ్లేందుకు ఎటువంటి అనుమతులు లేవని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు, వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని, ఈ మేరకు ఉద్యోగులకు ఇప్పటికే తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారుల ఆదేశాలను ఉల్లంఘించి అనుమతి లేని కార్యక్రమాలకు వెళ్లడం, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించడం వంటి చర్యలకు పాల్పడితే నిబంధనల మేరకు శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కర్నూలు ఎస్పీ స్పష్టం చేశారు.అనుమతి లేకుండా సామూహికంగా తరలివెళ్లడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా కార్యక్రమాలు నిర్వహించడం చేయరాదని తెలిపారు. కావున స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ, అనుమతి లేని "చలో విజయవాడ" కార్యక్రమానికి వెళ్లకుండా పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖ అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతోందని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు.

# మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ సేవలు దేశానికి చిరస్మరణీయం

**మాజీ ఎమ్మెల్సీ యం సుధాకర్ బాబు**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ సేవలు దేశానికి చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యులు ఎం సుధాకర్ బాబు అభిప్రాయపడ్డారు. మాజీ ప్రధాని, ఆర్థికవేత్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎం. సుధాకర్ బాబు మాట్లాడుతూ, డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక వ్యవస్థకు చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ప్రధానమంత్రిగా ఆయన దేశ అభివృద్ధి, ఆర్థిక సంస్కరణలు, పేదలు మరియు సామాన్య ప్రజల సంక్షేమం కోసం అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు.డాక్టర్ మన్మోహన్ సింగ్ తన నిరాడంబరత, నిబద్ధత, నిజాయితీతో ప్రజాసేవకు అంకితమైన నాయకుడిగా దేశ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని సుధాకర్ బాబు అన్నారు. ఆయన పాలనలో దేశ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడిందని తెలిపారు.డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆశయాలు, ప్రజాస్వామ్య విలువలు, లౌకికవాదం, సామాజిక న్యాయం వంటి సూత్రాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ యన్ సి బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బి సుబ్రహ్మణ్యం, రెడ్డి పోగు విజయభాస్కర్, యు శేషయ్య, అబ్దుల్ హై,రంగ స్వామి మొదలగు వారు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియపై శిక్షణ



**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 26** మున్సిపల్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియపై ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డోన్ పురపాలక సంఘం కార్యాలయంలో శనివారం ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు ఈ శిక్షణ ఇచ్చారు.మాస్టర్ ట్రైనర్ లక్ష్మీకాంత్ పాల్గొని చైర్మన్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన విధివిధానాలను అధికారులకు వివరించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, పత్రాల పరిశీలన, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను నిర్వహించే విధానం తదితర అంశాలపై సవివరంగా శిక్షణ అందించారు. నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రవికిరణ్, ఎలక్షన్ క్లర్క్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పంట వేసి నష్టపోయిన ప్రతి రైతుకు పంట నష్ట పరిహారం ఎకరాకు 50 వేల రూపాయలు ఇచ్చి రైతులను ఆదుకోవాలి

## ఏపీ రైతు సంఘం కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి దంభోళంశ్రీనివాసరావు

**కర్నూల్ సిటీ నందిపత్రిక** రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ సచివాలయాల కార్యదర్శులకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది అందులో భాగంగా ఉల్చాల సింగవరం పసుపుల తదితర గ్రామాలలో రైతులకు కరపత్రాలు పంచి ఆయా సచివాలయ సిబ్బంది వారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి దంభోళంశ్రీనివాసరావు రైతుల నష్ట కష్టాలు తెలుసుకొని ఈ విధంగా వివరిస్తూ కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని కరువు సహాయక చర్యలు చేపట్టాలని పంట వేసి నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు 50 వేల రూపాయలు పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలనిరైతులు బ్యాంకుల్లో తీసుకున్న వంట రుణాలను రెండు లక్షల రూపాయల దాకా రద్దు చేసి రైతులను రుణ విముక్తులగా చేయాలని అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు మేత లేక అల్లాడుతున్న పశువులకు పశుగ్రాసం ఉచితంగా అందించి పాడి పశువులను కాపాడే విధంగా చూడాలని ఆరుగాలం పనిచేసి ఎండకు వానకు ఏ మాత్రం లెక్క చేయకుండా తన ఆరోగ్యం తన కుటుంబాన్ని త్యాగం చేసి వ్యవసాయమే ధ్యేయంగా పెట్టుకొని పని చేస్తున్న ప్రతి రైతు కుటుంబానికి కరువు పెన్షన్ కింద 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించాల అని అలాగే పత్తి ఇతర పంటలువేసినష్టపోయిన ప్రతి రైతుకు తక్షణమేపంటల బీమా పరిహారం రైతులకు అందించాలనీఅలాగేప్రత్యామ్నాయ పంటలువేసుకోవడానికి రైతులకు ఉచితంగా నాణ్యమైన విత్తనాలు విత్తుకోవడానికి సరిపడా విత్తనాలు అందించాలని నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా అందించి ప్రతి రైతు కుటుంబానికి అందేలా చూడాలనిజాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం పనులు కల్పించి వలసలను నివారించి రోజు కూలీ రూ. 700/- లు ఇవ్వాలని జిల్లావ్యాప్తంగా కరువు తాండవ వాడుతున్న సందర్భంగా విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలని కోరుతూ అలాగేకొన్ని గ్రామాల్లో మూడు రోజులకు ఒకరోజు మంచినీరు వస్తుందని మరికొన్ని గ్రామాల్లో త్రాగునీటి సమస్య చాలా ఇబ్బందికరంగా ఉందని కనుక ప్రతి కుటుంబం నీటికే నెలకు సుమారు 300 నుంచి 500 రూపాయల వరకు ఖర్చు పెడుతున్నారు కనుక జిల్లాలోని అన్ని ప్రాంతాలలో త్రాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎన్ ఆంజనేయులు ఉల్చాల రైతులు డి శ్రీనివాసులు ఉప్పరి శ్రీనివాసులు నాగరాజు ప్రకాశం జి సింగవరం రైతులు రాజు శ్రీరాములు పసుపు ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు



# 'సేవా సంకల్ప్ అభియాన్'..క్షేత్రస్థాయిలో అంగన్వాడీ, ఆశా వర్కర్లకు సన్మానాలు...





## సేవా స్ఫూర్తితో అంగన్వాడీల బలోపేతం చిన్నారులు, తల్లుల సంక్షేమమే బిజెపి లక్ష్యం

**కాశినాయన, సెప్టెంబర్ 26 (నంది పత్రిక):** గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ, మహిళలు, గర్భిణీల ఆరోగ్య సంరక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న అంగన్వాడీ సిబ్బంది సేవలకు అరుదైన గౌరవం దక్కింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శ్రీ అవదూత కాశినాయన మండలం గంగనపల్లె గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో 'సేవ సంకల్ప అభియాన్ - అంగన్వాడీ ఉత్సవం' అత్యంత వైభవంగా నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర నాయకులు, సేవ సంకల్ప అభియాన్ అంగన్వాడీ ఉత్సవాల బద్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ బుసిరెడ్డి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగినకార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఐసీడీఎస్ ( ఐ సి డి ఎస్ )కాశినాయన మండల సూపర్వైజర్ చంద్రకళ అధ్యక్షతన, బీజేవైఎం రాష్ట్ర నాయకులు, సేవ సంకల్ప అభియాన్ అంగన్వాడీ ఉత్సవాల బద్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ బుసిరెడ్డి మనోహర్ రెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పోషకాహార పథకాలను క్షేత్రస్థాయిలోకి విజయవంతంగా తీసుకెళ్లడంలో అంగన్వాడీల పాత్రను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు , దేశ ప్రగతి చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలపైనే ఆధారపడి ఉంటుందని, దానికి అంగన్వాడీ కేంద్రాలే మూలస్తంభాలని పేర్కొన్నారు. గంగనపల్లె గ్రామీణ ప్రాంతంలో చిన్నారులలో పోషకాహార లోపాన్ని నివారించడానికి, వారికి ప్రాథమిక అక్షరాస్యతను అందించడానికి టీచర్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అంగన్వాడీల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం బిజేపీ కాశినాయన మండల అధ్యక్షుడు బిజీవేముల నారాయణ రెడ్డి,మండల ప్రధాన కార్యదర్శులు బుసిరెడ్డి ప్రశాంతి,ఎదురు భాస్కర్ రెడ్డి లు మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు సంపూర్ణ పోషణ వంటి పథకాలను సక్రమంగా అందించడంలో సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని చెప్పారు. చిన్నారుల బరువు, ఎత్తు వంటి ఎదుగుదల పారామితులను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పునాది పడుతోందని వివరించారు.

**విజయవంతం చేసిన ఐసీడీఎస్ బృందం:** గంగనపల్లెలో అంగన్వాడి ఉత్సవాలు విజయవంతం కావడంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు, చంద్రకళ, హరిప్రియ, అంగన్వాడి టీచర్లు కీలక పాత్ర పోషించారు. కేంద్రాల నిర్వహణ, లబ్ధిదారులకు అందుతున్న సేవలపై వారు ప్రత్యేక పర్యవేక్షణ చేశారు.సాధారణంగా విధుల ఒత్తిడిలో ఉండే తమను గుర్తించిన బిజెపి నాయకులు సన్మానించడం పట్ల అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం తమలో మరింత ఉత్సాహాన్ని నింపిందని, భవిష్యత్తులో మరిన్ని మెరుగైన సేవలు అందిస్తామని వారు పేర్కొన్నారు. గంగనపల్లె గ్రామంలో పండుగ వాతావరణంలో జరిగిన ఈ ఉత్సవాల పట్ల స్థానికులు సైతం హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎదురు నాగార్జున రెడ్డి, బిజెపి మండల ఉపాధ్యక్షుడు సురేష్ నాయుడు, ప్రతాప్ రెడ్డి,అభిలాష్,ప్రసాద్ , బాలింతలు, గర్భిణీలు పలువురు అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సెంటర్లో ఘనంగా 9 జాతీయ పోషణ మాసం.

**సిరివెళ్ల (నంది పత్రిక):** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు అంగన్వాడీ కేంద్రంగా శనివారం జాతీయ పోషణ మాసం2026 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త కళావతి, సునందిని, మహిళలు, గర్భిణులకు పోషకాహార ప్రాముఖ్యతను చార్టుల ద్వారా వివరించారు.ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, పండ్లు వంటి పోషకాహారాన్ని రోజువారీ ఆహారంలో తీసుకొని గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించడంతో పాటు తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, తృణధాన్యాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, మహిళలు, ఆశా వర్కర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు వీఆర్ఏల వినతిపత్రం



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 26 నంది పత్రిక** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విఆర్ఏలు ఎమ్మెల్యే శనివారం వినతిపత్రం సమర్పించారు ఆళ్లగడ్డ తాసిల్దార్ కార్యాలయం నివాసానికి ర్యాలీగా వెళ్లి ఆమెకు వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మొదటిగా పేసుకెళ్ళు ఇవ్వాలని అలాగే ప్రమోషన్లు ఇవ్వక ఎనిమిది సంవత్సరాలు అవుతుందని నామినీలుగా ఉన్న వీఆర్ఏలను పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు వారి సమస్యలను విన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రభుత్వం దృష్టికి వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

## సంగమేశ్వరంను సందర్శించిన ఉడిపి పలిమారుమట పిఠాధిపతులు



**కొత్తపల్లి – నంది పత్రిక :** మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రం సంగమేశ్వరంను ఉడిపి పలిమారుమట పిఠాధిపతులు శ్రీ విద్యాధీశ శ్రీపాదులు, శ్రీ విద్యాదీశ రాజేశ్వర శ్రీపాదులు శనివారం సందర్శించారు. ఎగువ పుష్కర ఘాట్ వద్ద ఉన్న ఉమామహేశ్వరాలయంలో శివలింగానికి కృష్ణాజలాలతో జలాభిషేకం. కుంకుమార్చన, పుష్పార్చన. మంగళహారతి వంటి విశేష పూజలను ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అదేవిధంగా సప్తనదీ జలాలలో పుణ్యస్నానాలు ఆచారించారు. లలితాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టూ ఆలయ పరిసర ప్రాంతాలను సందర్శించారు. వారివెంట భక్త బృందం ఉన్నారు.

## ప్రేమ్ స్వరూప్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి బుగ్గన తనయుడు అర్జున్‌రెడ్డి.



**బేతంచెర్ల సెప్టెంబర్ 26 ( నందిపత్రిక ).** బేతంచెర్ల పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త ప్రేమ్ స్వరూప్ తండ్రి ఆనందరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎపి.ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి తనయుడు,యువ నాయకుడు బుగ్గన అర్జున్‌రెడ్డి శనివారం ప్రేమ్ స్వరూప్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆనందరావు మృతికి సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.ప్రేమ్ స్వరూప్ కుటుంబానికి ధైర్యం చెప్పారు.

## మతసామరస్యానికి ప్రతీకగా బనగానపల్లె ఉరుసు ఉత్సవాలు: మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



**బనగానపల్లె సెప్టెంబర్ 26నందిపత్రిక** దర్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన మంత్రి బనగానపల్లె పట్టణంలో హుస్సేనీ బాషా సాహెబ్, జండా వాలే సాహెబ్ ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు ఘనస్వాగతం పలికారు.అనంతరం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హుస్సేనీ బాషా సాహెబ్, జండా వాలే సాహెబ్ దర్గాలను సందర్శించారు. దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ, బనగానపల్లెలో నిర్వహించే ఉరుసు ఉత్సవాలు హిందూముస్లింల మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యంతో ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషకరమన్నారు. ప్రజలందరూ పరస్పర సోదరభావంతో, శాంతియుత వాతావరణంలో కలిసిమెలిసి జీవించాలని ఆకాంక్షించారు.

## ఘనంగా అంగన్వాడి జాతీయ పోషణ మాసోత్సవాలు



**ఆళ్లగడ్డ ప్రతినిధి, సెప్టెంబర్ 26 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలం జి జంబులదిన్నె గ్రామం లోని అంగన్వాడి కేంద్రంలో 9వ జాతీయ పోషణ మాసం2026 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ పార్వతి పాల్గొని మహిళలు, గర్భిణులకు పోషకాహార ప్రాముఖ్యతను చార్టుల ద్వారా వివరించారు.ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, పండ్లు వంటి పోషకాహారాన్ని రోజువారీ ఆహారంలో తీసుకొని గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించడంతో పాటు తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, తృణధాన్యాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే గర్భవతులకు బాలింతలకు న్యూట్రిషన్ సంబంధించిన కరపత్రాన్ని వారికి అందజేశారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బద్వేల్ బిడ్డకు నీట్ పీజీ డెంటల్ లో ఆల్ ఇండియా ర్యాంక్!



**బద్వేలు, సెప్టెంబర్ 26 (నంది పత్రిక):**బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చిన్న గ్రామం చింతపుతాయపల్లె నుంచి ఒక యువ డాక్టర్ జాతీయ స్థాయిలో సత్తా చాటాడు. సాధారణ ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుల కుమారుడైన బిజివేముల హరి పవన్ కుమార్ రెడ్డి మే నెలలో జరిగిన నీట్ పీజీ డెంటల్ ( ఎం. డి. ఎస్ ) పరీక్షలో ఆల్ ఇండియా 2288 ర్యాంక్, ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో టాప్ 18వ ర్యాంకు సాధించి బద్వేలు ఖ్యాతిని దేశ వ్యాప్తంగా చాటాడు.ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయులు బిజివేముల పోలిరెడ్డి – లక్ష్మీదేవమ్మ దంపతుల కుమారుడైన పవన్ చిన్నప్పటి నుంచి చదువులోనే కాదు క్రమశిక్షణలోనూ ఫస్ట్. తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులు కావడం వలన విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించి వందలాది మందిని ప్రయోజకులను చేస్తే, కొడుకు ఇప్పుడు వైద్య రంగంలో బద్వేలు ప్రజలకు సేవ చేయడానికి సిద్ధమౌతున్నారు.. ఈ సందర్భంగా హరి పవన్ రెడ్డి మాట్లాడుతూ... "నా తల్లిదండ్రులు అలాగే నా మేనమామ గాజులపల్లె మధుసూదన్ రెడ్డి (సాఫ్ట్వేర్ కెనడా)...నాకు ఆదర్శం. నా తల్లిదండ్రులు ఉపాధ్యాయ వృత్తి ద్వారా సమాజానికి సేవ చేసినట్లే, నేను వైద్యం ద్వారా నా బద్వేలు ప్రజలకు నాణ్యమైన, నమ్మకమైన వైద్య సేవలు అందించడమే నా జీవిత లక్ష్యం. నా విజయం బద్వేలు యువతకు స్ఫూర్తి కావాలి" అని అన్నారు.చిన్న గ్రామం నుంచి వచ్చి జాతీయ స్థాయిలో ర్యాంకు కొట్టిన పవన్ కు ఆత్మీయులందరూ అభినందనలు తెలిపారు...

## కర్నూలులో సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహం ఆవిష్కరించిన మంత్రి టీజీ భరత్



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలోని గాంధీనగర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. సూపర్‌స్టార్ కృష్ణ ఎంతో క్రమశిక్షణ కలిగిన నటుడని అన్నారు. 350కి పైగా చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న గొప్ప నటుడు సూపర్‌స్టార్ కృష్ణ అని కొనియాడారు. కర్నూలు నగరంలో సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని మంత్రి తెలిపారు. అభిమానులు తమ అభిమాన హీరోలపై ఉన్న ప్రేమను సేవా కార్యక్రమాల ద్వారా చాటుకోవాలని మంత్రి టీజీ భరత్ సూచించారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను అభిమానులు నిరంతరం కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

## ఘనంగా అంగన్వాడి ఉత్సవాలు



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 26 నంది పత్రిక** అంగన్వాడి ఉత్సవాల్లో భాగంగా శనివారం నాడు ఆళ్లగడ్డ పట్టణంలోని10 ,2 3 ,5,6,7 ,8, 14, 4 సెంటర్లలో అంగన్వాడి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ దస్తగిరమ్మ పాల్గొన్నారు.అంగన్వాడి సెంటర్లలోని మూడు సంవత్సరములు నిండిన చిన్నపిల్లలు తల్లులు సెంటర్కు హాజరయ్యారు ఈ సందర్భంగాతల్లుళ్లను అంగన్వాడికి వచ్చే తమ పిల్లలకుఆటపాటల ద్వారా విద్యఅభినయ గేయాలు బొమ్మలకురంగుల వేయడంలాంటి కార్యక్రమాలు చేయించారు అంగన్వాడీలోతమ పిల్లల ఒక్కొక్క పిల్లవానికి ప్రభుత్వం వారి నుండి నాలుగు పుస్తకాలు మ్యాథ్స్,ఇంగ్లీషు , తెలుగు ఆక్టివిటీ బుక్స్ వచ్చాయని ఆ పుస్తకాలలో ఉన్న అన్ని విషయాలను అంగన్వాడీ కార్యకర్త పిల్లలకు బోధిస్తుందని విషయాన్ని తల్లులకు సమావేశం ద్వారా వివరించడమైనది అలాగే ఉదయం 10 గంటలకు పిల్లలకి గుడ్డు తినిపిస్తారని 12 గంటలకు వేడివేడి భోజనం అందిస్తామని సా యంత్రం మూడు గంటలకి వేడి పాలు ఇవ్వడం జరుగుతుందనే విషయాన్ని తల్లులకు తెలిపారు క్రమం తప్పకుండా అంగన్వాడికి తమ పిల్లలని పంపించే తల్లులందరికీ సన్మానించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు తల్లులు పాల్గొన్నారు.

## యువత స్వశక్తితో ఎదగాలి..
## టిడిపి నంద్యాల జిల్లా ప్రతినిధి నాగరాజు యాదవ్



**చాగలమర్రి సెప్టెంబర్ 26 నంది పత్రిక** యువత స్వశక్తితో ఎదగాలని తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ స్పోక్ పర్సన్ సల్ల నాగరాజు యాదవ్ అన్నారు. శనివారం ఆయన చాగలమర్రి టోల్ ప్లాజా సమీపంలో ఉత్తేజిత గోడౌన్ పక్కన శెట్టివీడు గ్రామానికి చెందిన అశోక్ అనే యువకుడు ఏర్పాటు చేసుకున్న వ్యాపార సముదాయాన్ని ప్రారంభించారు. తన కుటుంబానికి అండగా ఉంటూ సమాజ శ్రేయస్సు కోరి నిజాయితీగా బ్రతకాలి అన్నారు. ఈ కార్యక్రమంలో టి ఎన్ టి యు సి గుత్తి నరసింహుడు, బీసీ సంఘం నాయకులు టైలర్ భాష, పీరయ్య, మైనారిటీ నాయకులు సయ్యద్ బషీర్, మాజీ వార్డు సభ్యులు సుబ్బారావు, బాల దస్తగిరి, ఆళ్లగడ్డ టిడిపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కసినేని ఓబులేసు, నాగార్జున ఫరూక్, కలాం బీడీ బషీర్, సురేంద్ర మోహన్ కృష్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

## తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మకు 131వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన అఖిలభారత రజక సంఘం.



**గోస్పాడు (నంది పత్రిక)** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, చాకలి ఐలమ్మ (చిట్యాల ఐలమ్మ) 131వ జయంతి సందర్భంగా గోస్పాడు మండల పరిధిలోని యాల్లూరు గ్రామంలో అఖిలభారత రజక సంఘం ఆధ్వర్యంలో ఆమెకు ఘనంగా నివాళులర్పించారు.

బ్రమణ్యం రజక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం రజక మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఐలమ్మ అందించిన స్ఫూర్తిని కొనియాడారు. తన భూమిని కాజేయడానికి ప్రయత్నించిన విస్నూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డిని ధైర్యంగా ఎదిరించి, ఎర్రజెండా పట్టి, తన పంటను కాపాడుకున్న ఐలమ్మ సాహసం తెలంగాణ రైతాంగ పోరాటంలో మొదటి విజయాన్ని అందించింది. ఆమె పోరాటం తర్వాతి తరాల రజకులకు, వెనుకబడిన వర్గాల వారికి నిరంతర స్ఫూర్తి అని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉద్ఘాటించారు. చాకలి ఐలమ్మ రజక (చాకలి) కులానికి చెందిన వ్యక్తి. ఆమె సేవలను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం ఆమె జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రజక సంఘం నాయకులు, గోస్పాడు మండల అధ్యక్షుడు మద్దిలేటి, ఉపాధ్యక్షుడు ఏ . మదిలేటి, లక్ష్మయ్య, నడిపి సుబ్బరాయుడు, చిన్న నాగయ్య, నాగేష్, నాగభూషణం, గోవింద పల్లె మదిలేటి, మర్రి పల్లె నాగరాజు, గ్రామ పెద్దలు, రజక సోదర సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## జాతీయ రహదారులపై రోజురోజుకూ పెరుగుతున్న ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా.

### రాయలసీమ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రైవేట్ లిమిటెడ్‘ ఆధ్వర్యంలో సిరివెళ్లలో వాహనదారుల అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది.



**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల జాతీయ రహదారి పక్కన ఉన్న వాసవి హోటల్ సమీపంలోని ‘పాల్ టీ బార్‘ వద్ద నిర్వహించిన ఈ సదస్సులోవాహనదారులు పాటించాల్సిన పలు కీలక భద్రతా నియమాలను నిర్వాహకులకు ప్రత్యక్షంగా వివరించారు. హైవేపై ప్రయాణించే సమయంలో క్షణకాలం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలకే ప్రమాదమని... ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని పిలుపునిచ్చారు.“ఈ సందర్భంగా ఆర్‌పీవో (ౡూ) చిన్న ఓబయ్య, ఆర్‌పీ వెల్ఫేర్ (ౡా ఔవశ్రీఋతీవ) వెంకటరమణ మాట్లాడుతూ... జాతీయ రహదారిపై ప్రయాణికుల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను వెల్లడించారు.కర్నూలు నుంచి కడప వరకు ప్రయాణికుల అత్యవసర సేవల కోసం... 4 ప్రత్యేక వాహనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. హైవేపై ప్రయాణిస్తున్నప్పుడు మీ వాహనం హఠాత్తుగా నిలిచిపోయినా,లేదా ఏదైనా ప్రమాదం జరిగినా... ఆందోళన చెందకుండా వెంటనే ‘1033‘ టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

**ఈ కార్యక్రమంలో వాహనదారులు ప్రాల్గొన్నారు.** ‘మీ భద్రత మనందరి బాధ్యత‘.

ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా ప్రవర్తించినప్పుడే ప్రమాద రహిత రహదారుల నిర్మాణం సాధ్యమవుతుంది. జాగ్రత్తగా ప్రయాణించండి... సురక్షితంగా గమ్యం చేరండి.

## రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందజేసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 26 నంది పత్రిక** ఆళ్లగడ్డ నియోజకవర్గానికి సంబందించిన 48 మంది బాధిత కుటుంబాలకు, 22,27, 003 రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ బాధితులకు అందజేశారు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు తీసుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు మరియు సీఎం నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు . మాజీ కౌన్సిలర్ హుస్సేన్ బాషా టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## దోమల లార్వాను నియంత్రించడంలో గంబుషియా చేపలు బేష్

### - మలేరియా సబాయూనిట్ అధికారి క్రిష్ణారెడ్డి

**కొత్తపల్లి – నంది పత్రిక :** దోమల లార్వాను నియంత్రించడంలో గంబుషియ చేపలు ముఖ్యపాత్ర పోషిస్తాయని మలేరియా సబాయూనిట్ అధికారి క్రిష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నందికుంట గ్రామంలోని కుంటలో గంబుషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న కుంటలలో దోమల లార్వా ఎక్కువగా వృద్ధి చెందుతుంది అన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టడడంలో వాటిని లార్వా దశలోనే అరికట్టేందుకు ఈ చేపలు ఎంతగానో తోడ్పాటు నిస్తాయన్నారు. ఈ చేపలు దోమల లార్వాను ఒక్క రోజులో 100 నుంచి 200 లార్వాలను తినగలవన్నారు. వీటిని నీటిలో విడవడం వల్ల దోమలను నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీరాములు నాయక్, హన్నమ్మ, సాయమ్మ, ఆశవర్కర్లు, ఉన్నారు.





## డోర్ టు డోర్ కార్యక్రమం 100 శాతం పూర్తి చేసిన టీడీపీ నేతలకు సన్మానం



**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 26** డోన్ పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమాన్ని పట్టణంలో 100 శాతం పూర్తి చేసిన సందర్భంగా పార్టీ నాయకులు, క్లస్టర్ ఇంచార్జ్లను ఘనంగా సన్మానించారు. శనివారం డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ యూనిట్ ఇంచార్జ్లు, బూత్ ఇంచార్జ్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డోర్ టు డోర్ కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించి పట్టణంలో వంద శాతం పూర్తి చేయడంలో కృషి చేసిన డోన్ క్లస్టర్6 ఇంచార్జ్ దస్తగిరి, క్లస్టర్7 పట్టణ టీడీపీ అధ్యక్షులు టి.ఈ. రాఘవేంద్ర గౌడ్, లోక్‌నాథ్‌రావు లను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు పట్టణంలోని యూనిట్, క్లస్టర్, బూత్ స్థాయి నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భవిష్యత్‌లో కూడా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ యూనిట్ ఇంచార్జ్లు, బూత్ ఇంచార్జ్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ నెల 28వ తేదీ సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం

**కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల స్థాయిల్లో అర్జీల స్వీకరణ సమస్యల స్థితిగతుల కోసం '1100' కాల్ సెంటర్‌ను సంప్రదించాలి**

**కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**




**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు కలెక్టరేట్ ప్రాంగణంలోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి స్వయంగా వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు , మండల రెవెన్యూ కార్యాలయాలు , మున్సిపల్ కార్యాలయాల్లోనూ ఈ వేదిక అందుబాటులో ఉంటుందని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**'1100' ద్వారా అర్జీల పురోగతి పరిశీలన** సమర్పించిన దరఖాస్తులు ఏ దశలో ఉన్నాయో తెలుసుకోవడానికి, పరిష్కారం కాని పక్షంలో ఆ సమాచారం కనుక్కోవడానికి అర్జీదారులు కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ సూచించారు. అంతేకాకుండా, ప్రజలు కార్యాలయాలకు రాలేని పక్షంలో వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా కూడా తమ సమస్యలపై ఆన్‌లైన్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చని వివరించారు.

## శ్రీ సర్వ లక్ష్మీనరసింహ స్వామి ఆలయమంతా గంటల మోత.

**స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు.**

**ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు.**

**సిరివెళ్ల(నంది పత్రిక)** నంద్యాల బిఒంగోలు జాతీయ రహదారిలో అభయారణ్యం లో వెలసిన శ్రీ సర్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఎత్తైన కొండలు, ఆహ్లాదాన్ని పంచే పచ్చని నల్లమల అడవి అందాల మధ్య నల్లమల అడవిలో శ్రీ లక్ష్మీ సర్వ నరసింహస్వామి ఆలయ మంత గంటల మొతతో మారుమోగింది . భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం తో ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. శనివారం సందర్భంగా శ్రీ సర్వ లక్ష్మీ నరసింహ స్వామి నీ ఉదయాన్నే శుద్ధి చేసి నూతన వస్త్రాలను ధరించి, ఆకు పూజ, తీర్థ అభిషేకం ,కుంకుమార్చనలతోపాటు ప్రత్యేకం ఆభరణాలతో రంగు రంగులతో కూడిన పుష్పాలతో, వివిధ రకాల పండ్లతో, శ్రీ సర్వ లక్ష్మీ నరసింహ స్వామిని అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్ర, డి.చిన్న , దేవస్థాన కమిటీ వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు వేద పండితులైన శ్రీ సర్వ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పూజారులు రంగనాయకులు, పవన్ లు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వదిం చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు . జిల్లాల నుండే కాకుండా మండలాల నుండి, గ్రామాల పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలుస్వీకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో భక్తులకు స్వామివారిని దర్శించుకునేందుకు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశారు. భక్తులకు స్వామివారి ని దర్శించుకు నేందుకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్ర ప్రత్యేక చర్యలు చేపట్టారు.



## విజయవంతంగా జరిగిన ఉచిత కిడ్నీ మరియు కంటి వైద్య శిబిరం



**సిరివెళ్ల (నంది పత్రిక)** భారత్ వికాస్ పరిషత్ మరియు ఖండే బ్రదర్స్ అయినా ఆనంద్ గురూజీ శ్యాంసుందర్లాల్ నేతృత్వంలో ఉల్లి నాగేశ్వరుడు కాంప్లెక్స్ నందు ఈ దినం ఉదయానంద హాస్పిటల్ డాక్టర్ల బృందం అయినా డాక్టర్ కె ప్రశాంత్ బాబు గారిచే కిడ్నీ పరీక్షలు నిర్వహించగా 22 మంది కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు అలాగే కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ ఎం భవ్యశ్రీ గారు సుమారు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 35 మందిని శుక్లమా ఆపరేషన్కు ఎంపిక చేశారు వీరికి నంద్యాల ఉదయానంద హాస్పిటల్ కు తీసుకెళ్లి రాను పోను వెహికల్ ఏర్పాటు చేసి ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తారని కండె ఆనంద్ గురూజీ తెలిపారు అలాగే 45 మందికి కంటి నొప్పితో బాధపడే వారికి చుక్కల మందు మాత్రలు ఉచితంగా పంపిణీ చేశామన్నారు ఇలాంటి కార్యక్రమాలు డాక్టర్ల సహకారం తో మరిన్ని చేపడతామని తెలిపారు ఈ కార్యక్రమం విజయవంతం అగుటకు భాగస్వామ్యం ఊహించిన టెక్నీషియన్లు అశోక్ గారికి అలాగే అబ్దుల్ రహమాన్ గారికి మరియు లేడీ సిస్టర్లు కు అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా కండే శ్యాంసుందర్లాల్ మాట్లాడుతూ సుమారు 150 మందికి పైగా వైద్య శిబిరానికి హాజరుకాగా వీరందరినీ డాక్టర్లు క్షుణ్ణంగా పరిశీలించి ఆపరేషన్కు అర్హులైన వారికి ఉచితంగా శాస్త్రవేత్త చేసి పంపెదమని తెలపడం అందులకు వారిని అభినందించారు ఇప్పటికీ 1858 మందికి పైగా గత 18 సంవత్సరాల నుండి ఉచితంగా చేపించామని తెలిపారు ఇలాంటి సేవా కార్యక్రమాలు మా సోదరుడు కండే ఆనంద్ గురూజీ నడుపుచున్నందుకు , మమ్ములను భాగస్వామ్యం చేస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు అభినందించారు ఈ కార్యక్రమంలో సూరా పెద్దన్న ,ఉల్లి నాగేశ్వరుడు ,సురేంద్ర ,ముధం భాస్కర్ ,పసుల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పార్టీల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న డోన్ ఎమ్మెల్యే కోట్ల



**డోన్, సెప్టెంబర్ 26 నంది పత్రిక** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి పార్టీల మధ్య సమన్వయం, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పరస్పరం ఆత్మీయంగా కలుసుకుని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. కూటమి పార్టీల మధ్య సమన్వయంతో ముందుకు సాగుతూ క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను మరింత పటిష్టం చేయడం, నాయకులు, కార్యకర్తల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామ, మండల, పట్టణ స్థాయిల్లో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై నాయకులు అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టాలని చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశీలకులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, జనసేన కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ యనమలతో పాటు కూటమి పార్టీల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్కారు బడికే ఓటు.. కానీ పథకానికి మాత్రం నోటు లేదు!

**ఆరుగురు బిడ్డలు.. 'తల్లికి వందనం'లో అర్హత ఉన్నా సున్నా లబ్ధి**



**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 26 (నంది పత్రిక):** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం క్షేత్రస్థాయిలో అర్హులకు అందడం లేదనడానికి ఈ ఘటన నిదర్శనం. పోరుమామిళ్ల మండలం అక్కలరెడ్డిపల్లికి చెందిన సుభద్ర, బాలయ్య దంపతులకు ఆరుగురు ఆడపిల్లలు. వీరంతా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుంటున్నారు. పథకానికి సంబంధించిన పూర్తి అర్హతలు ఉన్నప్పటికీ, ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా వీరి ఖాతాలో పడకపోవడంతో ఆ తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం అంధకారంలో పిల్లల భవిష్యత్తు:** సమస్యను పరిష్కరించాలని కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా, అధికారులు మాత్రం "మా చేతుల్లో ఏమీ లేదు" అని బాధ్యతారాహిత్యంగా సమాధానమిస్తున్నారని బాధిత కుటుంబం వాపోతోంది. నిరుపేద కుటుంబంలో ఆరుగురు బిడ్డలను చదివించడం భారంగా మారిన తరుణంలో, అధికారుల అలసత్వం వల్ల పిల్లల చదువులు ఎక్కడ ఆగిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా ఇంకెందరో?** కేవలం సాంకేతిక కారణాలు, అవగాహన లేకపోవడం మరియు అధికారుల నిర్లక్ష్యం వల్ల పథకాలకు దూరమై, మీడియా ముందుకు రాలేకపోతున్న నిరుపేద కుటుంబాలు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో ఉన్నాయి.

**తక్షణమే స్పందించాలి:** ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రత్యేక చొరవతో ఈ కుటుంబానికి 'తల్లికి వందనం' సాయం అందేలా న్యాయం చేయాలని స్థానికులు, హక్కుల కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. అర్హులైన పేదలకు పథకాలు అందనప్పుడు ఈ ఆర్భాటపు ప్రకటనలకు అర్థమేంటని ప్రజాసంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి--

**ఎంఈఓ శేష శయనా రెడ్డి**



**చాగలమర్రి సెప్టెంబర్ 26 నంది పత్రిక** విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని మండల విద్యాశాఖ అధికారి శేషశయనారెడ్డి సూచించారు. చాగలమర్రి మండలం పెద్దభోధనం గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో శనివారం జరిగిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో అయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన విద్యా బోధన ప్రమాణాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ విద్యా బోధన పద్ధతులను గురించి ఆయన వివరించారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ హెచ్.ఎం వరలక్ష్మి, శివ శంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దొంగలు దోచుకున్న బంగారు సొత్తును రికవరీ చేసిన బేతంచెర్ల సిఐ.& ఎస్ఐ.



**బేతంచెర్ల సెప్టెంబర్ 26 ( నందిపత్రిక ).** ఈ నెల 23.06.2026 బుధవారం,మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో బేతంచెర్ల టౌన్ కు చెందిన మాలి సరస్వతి, బేతంచెర్ల టౌన్ లోని వీరారెడ్డి ఇంటి దగ్గర వెళ్తూ ఉండగా,ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు,పల్సర్ మోటార్ సైకిల్ పైన వస్తూ,ఆమెను ఫాలో అయ్, ఆమె మెడలో ఉన్న బంగారు చైన్ ని దొంగిలించు కొని పోయారని,ఈ విషయమై అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు బేతంచెర్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చినందున, సదరు ఫిర్యాదు మేరకు బేతంచర్ల పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయడమైనది. సదరు కేసు విచారణలో భాగంగా, బేతంచెర్ల సిఐ వెంకటేశ్వర రావు, ఎస్ఐ. రమేష్ బాబు పోలీస్ సిబ్బందితో కలిసి శనివారం నాడు ముద్దాయిల గురించి రాబడిన ఖచ్చితమైన సమాచారంమేరకు సిమెంట్ నగర్ గ్రామం వెలుపల గల సుంకులమ్మ గుడి వద్ద, ఆరంగుల మద్దిలేటి, (వయసు 26 సం.లు) తండ్రి ఆరంగుల చిన్నన్న, హరిజనవాడ నంద్యాల టౌన్, మరియు ఆరంగుల మధుకుమార్ (వయసు (22 సం.లు) తండ్రి ఆరంగుల కృష్ణ, హరిజనవాడ, నంద్యాల టౌన్ అను పేరుగల వారిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి చోరీ సొత్తు అయిన బంగారు చైన్ రికవరీ చేసి, వాళ్ళు నేరము చేయడానికి ఉపయోగించిన పల్సర్ సైకిల్ ను స్వాధీన పరచుకొని, వారిని రిమండ్ కు పంపడమైనదని బేతంచెర్ల పోలీసు వారు తెలిపారు.

## పోషణతో ఆరోగ్యం... మంచి భవిష్యత్తు ఉంది...

**అంగనవాడి టీచర్ హసీనా**




**చాగలమర్రి సెప్టెంబర్ 25 నంది పత్రిక** మాతృ సంరక్షణ, శిశు అభివృద్ధి, మహిళా సాధికారత సాధించేందుకు పోషణ ఎంతో అవసరం అని పోషణతో భవిష్యత్తులో మంచి ఆరోగ్యం కలిగి ఉంటారని అంగన్వాడీ టీచర్ హసీనా అన్నారు. 3 అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7 వరకు మా కేంద్రంలో మూడు రోజులపాటు నిర్వహించాలన్నారు. భారత ప్రధాని ప్రారంభించిన సేవా సంకల్ప అభియాన్ ద్వారా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. టీకాలు బాల్య వివాహాల నివారణ, పోషన్ పక్వాడ, తల్లిదండ్రుల సమావేశాలు, ఆరోగ్య సమస్యలు, మానవ అక్రమ రవాణా నివారణ, పిల్లలు మానసిక ఒత్తిడికి గురికాకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రీ స్కూల్ కార్యకలాపాలు, మిషన్ వాత్సల్య, పీఎంఈవై, మాతృత్వ సేవలు, అంగనవాడి సెంటర్లో ఈ సేవలన్నీ అందుతాయని అంగనవాడి టీచర్ హసీనా తెలిపారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ మై మూన్ ఆయా కేజియా గర్భవతులు బాలింతలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## బేతంచెర్ల లో మూడు మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానం.




**బేతంచెర్ల సెప్టెంబర్ 26 ( నంది పత్రిక ).** బేతంచెర్ల మండలంలో మూడు మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ జప్ఫుల్లా సూచించారు. బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలో ఒకటి, గ్రామీణ ప్రాంతాల్లో రెండు దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. ఒక్కో దుకాణానికి దరఖాస్తు రుసుము 3 లక్షల రూపాయలు,స్లాబ్ ప్రకారం 60లక్షల 50 వేలు రూపాయలు పర్మిట్ రూమ్‌కు 5 లక్షల రూపాయలు,ప్రాసెసింగ్ ఫీజు ఒక వెయ్యి రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 1 తేది లోపు దరఖాస్తులు చేసు కొన వలయునని సూచించారు. దరఖాస్తులపై అవగాహన కల్పించేందుకు, ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టర్లు,ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత లైసెన్స్ దారులు, కొత్తగా దరఖాస్తు చేసుకునే వారితో సమావేశం నిర్వహించి, దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై సోమశేఖర్, దరఖాస్తు దారులు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# విలువలతో కూడిన విద్య ద్వారా పేదరికాన్ని జయించవచ్చు





**యువత లక్ష్యసాధనకు నైపుణ్యాలు, క్రమశిక్షణ ఎంతో అవసరం**

**రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు**

**చాంబర్స్ కళాశాలలో మెగా జాబ్ మేళాకు విశేష స్పందన 297 మంది ఎంపిక**

**పాలకొల్లు బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 26 నంది పత్రిక**
విలువలతో కూడిన విద్యను అభ్యసించడంతో పాటు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో కృషి చేస్తే యువత పేదరికాన్ని జయించి ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం పాలకొల్లు పట్టణంలోని బి.ఆర్.ఆర్. అండ్ జి.కె.ఆర్. చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ([illegible]), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో 20 ప్రముఖ కంపెనీల భాగస్వామ్యంతో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మాట్లాడుతూ, విద్యను పూర్తిచేసిన యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించడం, పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు సృష్టించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యువత కేవలం విద్యార్హతలకే పరిమితం కాకుండా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సమయపాలన, క్రమశిక్షణ వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అకాడమిక్ విద్యతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్, నైపుణ్యాలను పెంపొందించుకుని స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితే మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చన్నారు. చాంబర్స్ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమని మంత్రి అన్నారు. చాంబర్స్ కళాశాల విద్యార్థులతో పాటు ఇతర కళాశాలల విద్యార్థులకు కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మెగా జాబ్ మేళాను నిర్వహించడం ద్వారా యువతకు పరిశ్రమలతో నేరుగా అనుసంధానం కల్పించారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. చాంబర్స్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు పాలకొల్లు నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల నుండి జాబ్ మేళాకు704 మంది అభ్యర్థుల హాజరై 297 మంది ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. మొత్తం 704 మంది అభ్యర్థులు వివిధ కంపెనీలకు సంబంధించిన రాత పరీక్షలు, మౌఖిక పరీక్షలు, ఇంటర్వ్యూలలో పాల్గొనగా 141 మంది చాంబర్స్ కళాశాల విద్యార్థులు ఉండటం విశేషం అన్నారు. ఎంపికైన అభ్యర్థులకు కార్యక్రమంలో ఆఫర్ లెటర్లను అందజేశారు. తమ విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు లభించడంతో అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు. యువతకు స్థానికంగానే ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్వహించిన ఈ మెగా జాబ్ మేళా నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. భవిష్యత్తులో కూడా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ, ఉద్యోగ మేళాలను నిర్వహించడం ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు [illegible] మరియు కళాశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని హాయ్ నా అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.వి.ఆర్. నరసింహారావు, సెక్రటరీ కె.వి. సీతారామరాజు, అడిషనల్ చైర్మన్ తటవర్తి కృష్ణమూర్తి, ట్రెజరర్ ప్రవీణ్ భాను, ప్రిన్సిపల్ డాక్టర్ డి. వెంకటేశ్వరరావు, అకాడమిక్ అడ్వైజర్లు డాక్టర్ ఎ.బి.ఎస్. మూర్తి, నందుల సీతారామరాజు, గవర్నింగ్ బాడీ సభ్యులు జయప్రకాష్ నారాయణ, భూపతి రాజు విశ్వనాథరాజు, సతీష్, కటారి నాగేంద్ర కుమార్, వేగేశ్న రంగరాజు, దేవరపు లక్ష్మీనారాయణ, కొమ్ముల మురళీకృష్ణ, ప్లేస్‌మెంట్ అధికారులు జానకిరామయ్య, మీనా ఎస్ ఎస్ డి సి జిల్లా అధికారులు లోకమాన్, కిషోర్ రెడ్డి, నాన్ టెక్నికల్ అధికారులు రాధిక, సి.హెచ్. రమేష్, ఆంజనేయులు, 20 కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు ఎన్. రవికుమార్, రాంబాబు, రాము, రాధామాధవి, సత్యవేణి, ప్రసన్న నాగదేవి, ప్రసన్న, శిరీష, రంజని, చందన తదితరులు పాల్గొన్నారు.



# సెప్టెంబరు 27న ఆదివారం బ్యాంకులు పనిచేస్తాయి...

**ఖాతాదారులు బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ యం వి జాన్ మార్టిన్**



**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 26 నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లాలో సెప్టెంబరు 27, 2026 ఆదివారం బ్యాంకులు పనిచేస్తాయని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ యం వి జాన్ మార్టిన్ తెలిపారు. ఖాతాదారులు ఈ విషయాన్ని గమనించి తమకు అవసరమైన బ్యాంకింగ్ లావాదేవీలు, ఇతర సేవలను ఆదివారం వినియోగించుకోవాలని సూచించారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్( యు ఎఫ్ బి యు) ఆధ్వర్యంలో సెప్టెంబరు 28, 29, 30 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో, బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఖాతాదారులు ముందుగానే తమకు అవసరమైన బ్యాంకింగ్ లావాదేవీలను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా ఏటీఎంలు, డిజిటల్ బ్యాంకింగ్, ఇతర అందుబాటులో ఉన్న బ్యాంకింగ్ సేవలను అవసరాన్ని బట్టి వినియోగించుకోవాలని సూచించారు.

# అంతర్జాతీయ ఒరవడులకు ధీటుగా నూతన టర్మినల్ భవన నిర్మాణ పనులు చేపట్టాలి..!!





**భారత పౌర విమానయాన శాఖ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కింజరాపు జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్ లతో కలిసి కడప ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ భవన పనుల పురోగతి పరిశీలన**

**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 26 : నంది పత్రిక**
అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో.. అధునాతన సౌకర్యాలతో అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కడప ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని.. భారత పౌర విమానయాన శాఖ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కింజరాపు ఎయిర్ పోర్ట్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కడప ఎయిర్ పోర్ట్ ప్రాంగణంలో నూతన టర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనుల పురోగతిని భారత పౌర విమానయాన శాఖ గౌరవ కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు కింజరాపు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్. సవిత, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, రాజ్యసభ సభ్యులు సీఎం సురేష్ నాయుడు, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డా. నిధీమీనా, ఎయిర్ పోర్ట్ అథారిటీ ప్లానింగ్ హెడ్ అనిల్ గుప్త, ఎయిర్ పోర్ట్ అథారిటీ రీజినల్ డైరెక్టర్ ఆచార్య మధుసూదన్, ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పోదర్, జిల్లా నాయకులు భూపేష్ రెడ్డి, మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.అనంతరం ఎయిర్ పోర్ట్ టర్మినల్ భవన నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పౌర విమానయాన సేవారంగంలో ప్రయాణీకుల అనుభవాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని.. భారతీయ విమానాశ్రయాలను ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయికి దీటుగా నూతన టెర్మినల్ భవన నిర్మాణాలను పటిష్టంగా చేపట్టాలన్నారు. నూతన డొమెస్టిక్ టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనులను అత్యంత నాణ్యతతో, భద్రతా ప్రమాణాలతో అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా అన్ని రకాల అధునాతన వసతులతో నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ భవన నిర్మాణ పనుల్లో భాగంగా.. పర్యావరణానికి ఎలాంటి అంతరాయం కలగకుండా ఏరో డ్రమ్ నిర్మాణ పనులను చేపట్టేందుకు సంబందిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాతూ.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని టెర్మినల్‌ను మొదటి, రెండో దశల్లో విస్తరించేందుకు అభివృద్ధి ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వివరించారు. సిటీ సైడ్ అభివృద్ధి, చేరుకునే రహదారి, పార్కింగ్, సేవా భవనం, అగ్నిమాపక కేంద్రం, విమాన రాకపోకల నియంత్రణ కేంద్రం, ఐసోలేషన్ బే, డీవీఓఆర్, సౌర విద్యుత్ కేంద్రాలకు ప్రణాళికలో స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. కడప–బెంగళూరు, కడప–తిరుపతి, కడప–నెల్లూరు రహదారుల అభివృద్ధితో విమానాశ్రయానికి రహదారి అనుసంధానం మరింత మెరుగుపడుతుందని వివరించారు. 2022–23లో సుమారు 70 వేల మంది మాత్రమే వినియోగించిన కడప విమానాశ్రయాన్ని భవిష్యత్ ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఉడాన్ పథకం కింద ఆధునిక ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రాత్రి వేళల్లోనూ విమానాల రాకపోకలకు వీలుగా నైట్ ల్యాండింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని వివరించారు. కడప జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల్లోని సుమారు 25 లక్షల మంది ప్రజలకు ఈ విమానాశ్రయ అభివృద్ధి ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర మంత్రికి వివరించారు.అంతకుముందు.. కడప విమానాశ్రయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని ఎయిర్‌పోర్ట్ రీజినల్ డైరెక్టర్ ఆచార్య మధుసూదన్.. కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రికి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా పనుల పురోగతిని వివరించారు. దాదాపు 80 శాతం మేర నూతన టెర్మినల్ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2024 మార్చి 10న వర్చువల్ విధానంలో దేశవ్యాప్తంగా 14 విమానాశ్రయాల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కడప విమానాశ్రయ నూతన టెర్మినల్‌కు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. సుమారు రూ.266 కోట్ల అంచనా వ్యయంతో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పనులు చేపట్టినట్లు వివరించారు.కడప విమానాశ్రయం మొత్తం 1,110 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, 2,515 మీటర్ల పొడవు, 45 మీటర్ల వెడల్పుతో ఉన్న రన్‌వే కోడ్–సి రకం విమానాలకు అనుకూలంగా ఉంటుందని కలెక్టర్ వివరించారు. 16,455 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నూతన టెర్మినల్ భవనాన్ని నిర్మిస్తున్నామని, ఏటా 25 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా, రద్దీ సమయాల్లో గంటకు 1,800 మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యంతో టెర్మినల్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు.టెర్మినల్‌లో 24 చెక్–ఇన్ కౌంటర్లు, మూడు ఏరో బ్రిడ్జిలు, రెండు సామాను కన్వేయర్ బెల్టులు, మూడు భద్రతా తనిఖీ యంత్రాలు, 375 కార్ల పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఏకకాలంలో ఏడు కోడ్–సి విమానాలను నిలిపే సౌకర్యం కూడా అందుబాటులోకి రానుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి, రెవెన్యూ, స్థానిక జిల్లా ప్రజాప్రతినిధులు, ఎయిర్ పోర్టు అధికారులు పాల్గొన్నారు.













# జిల్లా స్థాయి యువజన సాంస్కృతిక పోటీలు 2026





## యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే యువజన సాంస్కృతిక పోటీల లక్ష్యం. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

**భీమవరం, బ్యూరో చీఫ్ 26 సెప్టెంబర్ నంది పత్రిక** విద్యార్థులు చదువుతోపాటు విభిన్న కళలు, సంస్కృతి, లలిత కళలు పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. భీమవరంలోని ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరి యంలో శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ - పశ్చిమ గోదావరి జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యువ జన సాంస్కృతిక పోటీలు - 2026 కార్యక్రమానికి కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ యువత చదువుతో పాటు కళల్లో నైపుణ్యం సాధించి క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. స్వామి వివేకానంద స్ఫూర్తి తో యువత ముందుకు సాగాలని అన్నారు. లలిత కళలు, సాంస్కృతిక అంశాల్లో ప్రావీణ్యం ఉన్నవారు భవిష్యత్తులో ఉద్యోగాల్లో చేరినప్పుడు మంచి టీమ్ స్పిరిట్‌తో పనిచేసి, ఇతరుల ను సైతం మెరుగ్గా సమన్వయంతో పని చేయగలరని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో యువత తమ ప్రతిభను ప్రదర్శించడంతో పాటు కళలు, సంస్కృతి, సంప్రదా యాలపై ఆసక్తిని పెంపొందించుకునే మంచి అవకాశమని అన్నారు. వివిధ సాంస్కృతిక విభాగాల్లో ప్రతిభ కనబరిచిన యువత కు తదుపరి స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించ డంతో పాటు ప్రోత్సాహం అందించటం జరుగు తుందన్నారు.

ఈ వేదికపై నిర్వహిస్తున్న ఫోక్ డాన్స్, ఫోక్ సాంగ్, వీధి నాటికలు, పెయింటింగ్, వ్యాస రచన వంటి 5 రకాల అంశాల పోటీల్లో యువతీ యువకులు, విద్యార్థులందరూ క్రియాశీలకంగా, ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటు కోవాలని తెలిపారు.జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను కనబరచాలని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచే యువత కు రాష్ట్ర స్థాయి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు, విజేతలకు, నిర్వాహకులకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజ నేయులు మాట్లాడు తూ దేశ గొప్పత నాన్ని ప్రపంచ స్థాయిలో తెలిపిన మహనీయుడు స్వామి వివేకానంద అని అన్నారు. యువతతోనే దేశాభివృద్ధి సాధ్య మని తెలిపారు. యువత దీక్ష పట్టుద లతో చేపట్టిన ఏ కార్యక్రమంలో అయినా విజయం సాధించగలుగుతారని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలలో తమకు ఆసక్తికర మైన రంగాలలో సాధన చేస్తే నిష్ణాతు లు అవుతారని అన్నారు. దీనివలన దేశ ప్రగతికి ఎంతో మేలు కలుగు తుందని తెలిపారు. శిక్షణ పొందిన యువత దేశ సేవకు ఎంతో అవసరమని అన్నారు. యువత మంచి ఆలోచన, నడవడితో ముందు కు సాగితే రాష్ట్రాని కి, దేశానికి మంచి పేరు తీసుకు రావచ్చుఅని అన్నారు. సెట్వెల్ సి.ఈ.ఓ, జిల్లా యువజన సంక్షేమాధికారి శ్రీ కె. ఎస్.ప్రభాకరరావు మాట్లాడుతూ యువతలోని కళా ప్రతిభను వెలికితీ యడం, సంప్రదాయ కళలను ప్రోత్స హించడం, ఆరోగ్య కరమైన సృజనాత్మక వాతావరణాన్ని కల్పించడం ద్వారా యువజన శక్తిని సమాజ అభివృద్ధికి వినియోగించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ప్రభుత్వం యువజనోత్సవాల ద్వారా యువతలో ప్రతిభను గుర్తించి ఉన్నత స్థాయిలో అవకాశాలు కల్పించే విధానాన్ని ప్రోత్స హిస్తుందని అన్నారు.తోలుత జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు శ్రీ వివేకానంద స్వామి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. యం. జగపతిరాజ, ప్రిన్సిపాల్ డా. బి.ఆర్.కె.వర్మ గారు, యూత్ కోఆర్డినేటర్ శ్రీ గాదిరాజు హరీష్ వర్మ, అధికారులు పాల్గొన్నారు.





# క్రీడా స్ఫూర్తిని ఐక్యతను పెంపొందించడానికి క్రీడా పోటీలు దోహదం

## ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 26 నంది పత్రిక**ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్ లోని సభ్యుల మధ్య క్రీడా స్ఫూర్తిని ఐక్యతను పెంపొందించడానికి క్రీడా పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.శనివారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆవరణలో ఫైర్ అండ్ సెక్యూరిటీ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల ను తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ మోహన్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్ ఆధ్వర్యంలో ఈ విధంగా బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఫైర్ అండ్ సెక్యూరిటీస్ పై అవగాహన కోసం ఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ రకాలుగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు రక్షణ కల్పిస్తున్నారని చెప్పారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి ఇలాంటి ఆటల పోటీలు నిర్వహించడంతోపాటు విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేయడం సంతోషకరమని అన్నారు. ప్రజలకు ఫైర్ అండ్ సెంక్యూరిటీ పై అవగాహన కల్పించడానికి ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. గత 25 సంవత్సరాలుగా ఈ స్వచ్ఛంద సంస్థ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. అభివృద్ధి చెందుతున్న మనలాంటి దేశాలకు ఇలాంటి స్వచ్ఛంద సంస్థల సేవలు మరింత అవసరమని ఎమ్మెల్యే గద్దె రామ మోహన్ చెప్పారు. తోటి వారికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ సంస్థను స్థాపించి సమర్థవంతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యులను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అభినందించారు. ఫైర్ అండ్ సెక్యూరిటీ అమరావతి చాప్టర్ ప్రెసిడెంట్ కాంతారావు మాట్లాడుతూ 2017వ సంవత్సరంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదగా అమరావతి చాప్టర్ ప్రారంభమైందని, ఆ రోజు నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. గత ఏడాది బ్యాడ్మింటన్ పోటీలను షెషన్-1 నిర్వహించామని, ఇప్పుడు షెషన్-2 బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ అసోసియేషన్ లోని సభ్యులందరూ ఈ క్రీడా పోటీలలో పాల్గొంటున్నారని అన్నారు. ఫైర్ సర్వీసెస్, సెక్యూరిటీ సంబంధించిన ఉద్యోగులు, ఇంజనీర్లు, ఆర్కిటెక్చర్లు ఎలక్ట్రానిక్స్ ఎక్విప్మెంట్ ప్రొవైడర్స్ అసోసియేషన్లో సభ్యులుగా ఉన్నారని చెప్పారు. అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించడం తమ అసోసియేషన్ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. తమ అసోసియేషన్ లోని సభ్యుల మధ్య క్రీడా స్ఫూర్తిని ఐకమత్యాన్ని పెంపొందించడానికి ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.



# పీఎం సూర్య ఘర్ పథకం అమలుపై జిల్లా కలెక్టర్ సమీక్ష.

## పీఎం సూర్య ఘర్ పథకం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 26 నంది పత్రిక**సౌర విద్యుత్ వినియోగం పట్ల ప్రతి వినియోగదారునిఇంటికి వెళ్లి అవగాహన కల్పించి యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎలక్ట్రికల్ సూపరింటెండింగ్ ఇంజనీర్, డివిజనల్ స్థాయి విద్యుత్ శాఖ అధికారులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ( ఎల్ డి ఎం), ఈఈలు, డీఈఈలతో జిల్లా కలెక్టర్ పీఎం సూర్య ఘర్ పథకం అమలుపై గూగుల్ మీట్ ద్వారా ప్రగతి సమీక్ష నిర్వహించారు.


**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ** జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం అమలుకు నిర్దేశించిన లక్ష్యాలను అన్ని డివిజన్లలో నూరు శాతం పూర్తి చేయాలని ఎలక్ట్రికల్ ఇంజనీర్లను ఆదేశించారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకాన్ని నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. సేవా సేతు కార్యక్రమంలో భాగంగా పథకం అమలుకు పక్కా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని, అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి పథకం ద్వారా కలిగే ప్రయోజనాలు, సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు లభించే సౌకర్యాలు, విధానాలపై వినియోగదారులకు సులభంగా అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించాలని అన్నారు. స్థానిక వెండర్లను భాగస్వామ్యం చేసి వినియోగదారులకు అవసరమైన సమాచారం అందించడంతో పాటు, సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు ప్రజలను చైతన్యపరచాలని సూచించారు.సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటు సమయంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు.

యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన మెటీరియల్‌ను విద్యుత్ శాఖ సిబ్బంది ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.ప్రత్యేకంగా తణుకు, ఆచంట మండలాల్లో పథకం అమలులో మరింత ప్రగతి సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. తదుపరి సమీక్షా సమావేశం నాటికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసి, సాధించిన ప్రగతిపై సమగ్ర నివేదికను సమర్పించాలని తెలిపారు.పథకం అమలులో వినియోగదారులకు ఎదురయ్యే సమస్యలను అధికారులు సానుకూలంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని, ప్రజలకు అవసరమైన మార్గదర్శకాలు అందించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా టిడ్కో గృహాలలో సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు



చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత డీఈలు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో పథకం లక్ష్యాల సాధనకు విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ పి. ఉషారాణి మాట్లాడుతూ ప్రజల్లో సానుకూలమైన అభిప్రాయం సేకరణ లో 23వ స్థానంలో ఉన్న పశ్చిమగోదావరి జిల్లా ప్రస్తుతం నాలుగో స్థానానికి చేరుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ అందిస్తున్న మార్గదర్శకాలు, ప్రత్యేక చొరవతోనే ఈ మెరుగైన ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. భవిష్యత్‌లో మరింత మెరుగైన ఫలితాలు సాధించి జిల్లాను మొదటి స్థానానికి తీసుకెళ్లేందుకు సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సమీక్షలో ఎలక్ట్రికల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి. ఉషారాణి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, విద్యుత్ శాఖ ఈఈలు, డీఈఈలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# రహదారి మౌలిక వసతుల ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలి...



## భూసేకరణ, అనుమతులు, యుటిలిటీ షిఫ్టింగ్‌పై సమన్వయంతో ముందుకు సాగాలి ఆర్అండ్‌బీ శాఖ కార్యదర్శి కోన శశిధర్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లకు సూచనలు

**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 26 నంది పత్రిక** మౌలిక వసతుల ప్రాజెక్టుల అమలులో జాప్యాలను నివారించి, పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలపై రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ కార్యదర్శి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో రోడ్లు, రైల్వేలు, జలమార్గాలు, పైప్‌లైన్లు, టెలికమ్యూనికేషన్ కేబుల్స్, విద్యుత్ ప్రసార మార్గాలు వంటి మౌలిక వసతులు కీలకంగా ఉన్నాయని, దేశ అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు వీటి విస్తరణతో పాటు నాణ్యత, సేవల సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు.ప్రాజెక్టుల అమలులో జాప్యానికి ప్రధాన కారణాల్లో భూసేకరణ ఒకటిగా గుర్తించబడిందని, భూ రికార్డుల డిజిటలైజేషన్, భూ వివరాల ఖచ్చితత్వం, పరిహారం చెల్లింపు, భూమి స్వాధీనం, మ్యుటేషన్ వంటి అంశాలను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించారు. డిజిటల్ ల్యాండ్ రికార్డులను సమగ్రంగా అనుసంధానం చేయడం, సమయపరిమితితో కూడిన భూసేకరణ ప్రక్రియ, ప్రత్యేక భూసేకరణ విభాగాల ఏర్పాటు, సమస్యల పరిష్కారానికి స్పష్టమైన వివరణ విధానం వంటి చర్యలను చేపట్టాలన్నారు.రహదారులు, రైల్వేలు తదితర ప్రాజెక్టుల నిర్మాణ మార్గాల్లో ఉన్న విద్యుత్ లైన్లు, నీటి పైపులైన్లు, మురుగునీటి పైపులు, టెలికాం కేబుల్స్ తదితర యుటిలిటీలను మార్చే ప్రక్రియలో సమన్వయం లోపం వల్ల జాప్యం జరగకుండా చూడాలన్నారు. జాతీయ రహదారులు నిర్మాణం, రోడ్ అండర్ బ్రిడ్జ్, రోడ్ అండ్ బ్రిడ్జ్ కోసం త్వరితగతిన స్థల సేకరణ పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాల్లో మౌలిక వసతుల ప్రాజెక్టుల అమలులో ఇప్పటికే అనుసరిస్తున్న ఉత్తమ విధానాలు, వినూత్న పరిష్కారాలు ఉంటే వాటిని గుర్తించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పంచుకోవాలని సూచించారు. ప్రాజెక్టుల ముందస్తు దశలోనే భూసేకరణ, అనుమతులు, యుటిలిటీ షిఫ్టింగ్ తదితర అంశాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం ద్వారా నిర్మాణ దశలో ఎదురయ్యే జాప్యాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు.

అదేవిధంగా రోడ్డు భద్రతకు సంబంధించిన అంశాలపై కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించారు. జిల్లాల వారీగా రోడ్డు భద్రతకు తీసుకుంటున్న చర్యలు, సమస్యలు, వివిధ శాఖల సమన్వయంతో చేపట్టాల్సిన చర్యలపై దృష్టి సారించాలని సూచించారు.



# 10 ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు 10వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు అర్హత

## జిల్లా కలెక్టర్, డాక్టర్ జి. లక్ష్మీశ



**విజయవాడ: బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 26, నంది పత్రిక** జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నందిగామ, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో జాబ్ మేళాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు.సెప్టెంబర్ 28, 2026 (సోమవారం) ఉదయం 9:00 గంటలకు నందిగామ నియోజకవర్గంలోని ఏపీ ఎన్జీవోస్ బిల్డింగ్, గాంధీ సెంటర్, నందిగామలో జాబ్ మేళా నిర్వహించనున్నారు.సెప్టెంబర్ 29, 2026 (మంగళవారం) ఉదయం 9:00 గంటలకు మైలవరం నియోజకవర్గంలోని డా.జకీర్ హుస్సేన్ డిగ్రీ కాలేజీ, ఇబ్రహీంపట్నంలో జాబ్ మేళా జరుగుతుంది.సెప్టెంబర్ 30, 2026 (బుధవారం) ఉదయం 9:00 గంటలకు జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ఎస్ ఏ వి& వి జె ఆర్ డిగ్రీ కాలేజీ, జగ్గయ్యపేటలో జాబ్ మేళా నిర్వహించనున్నారు.ప్రతి జాబ్ మేళాకు సుమారు 10 ప్రముఖ కంపెనీలు హాజరై వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్హతలు కలిగి, 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు గల యువతీ యువకులు ఈ ఉద్యోగాలకు అర్హులు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,000 నుంచి రూ.35,000 వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆసక్తి మరియు తగిన అర్హతలు కలిగిన అభ్యర్థులు ముందుగా ష్ట్రజూం://ఖుఱజూబఅఖుఎ.ఖజూ.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జాబ్ మేళాకు హాజరయ్యే సమయంలో రెస్యూమ్/బయోడేటా,, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్, పాన్ కార్డు కాపీ, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు నందిగామ జాబ్ మేళా 28.09.2026: 8919951682, 72072 08075 ఇబ్రహీంపట్నం జాబ్ మేళా 29.09.2026: 95027757755, 80083 76100 జగ్గయ్యపేట జాబ్ మేళా 30.09.2026: 9666815987, 96765 83213 జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# ముంపునకు గురైన పంట పొలాల్లో పంట నష్టం నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి

**నీరు తగ్గిన వెంటనే పంట నష్టాన్ని అంచనా వేయాలి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం బ్యూరో చీఫ్,సెప్టెంబర్ 26 నంది పత్రిక** ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన పంట పొలాల్లో పంట నష్టం నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు.ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపి పంట నష్టాన్ని తగ్గించేలా వ్యవసాయ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, డీఆర్ఓ, ఆర్డీఓలు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా పంటల ముంపు పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల ప్రభావంతో 17 మండలాల్లో మొత్తం 5,049 ఎకరాల వ్యవసాయ భూమి ముంపునకు గురికాగా, 3,113 మంది రైతులు ప్రభావితమైనట్లు తెలిపారు. ముంపు ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**ముంపు ప్రభావిత మండలాలు:** తాడేపల్లిగూడెం, తణుకు, పెంటపాడు, అత్తిలి, పెనుమంట్ర, వీరవాసరం, భీమవరం, పాలకొల్లు, ఆచంట, యలమంచిలి, పాలకోడేరు, పెనుగొండ, గణపవరం, ఇరగవరం, నరసాపురం, పోడూరు, ఆకివీడు మండలాలు.భీమవరం మండలంలోని రాయలం, గుణుపూడి, కోపల్లె ప్రాంతాల్లో కూడా పంట పొలాలు ముంపునకు గురైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు. స్థానిక మురుగునీటి డ్రెయిన్లు, ముఖ్యంగా నక్కల, తాడేరు, రాయకుదురు డ్రెయిన్లు పొంగిపొర్లడం, అలాగే గోస్తనీ నదిలో భారీగా వరద ప్రవాహం రావడం వల్ల పలు ప్రాంతాల్లో ముంపు పరిస్థితి ఏర్పడిందని కలెక్టర్ తెలిపారు. ముంపు నీటిని త్వరగా తొలగించేందుకు సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకురావాలని ఆదేశించారు. తీవ్రంగా ప్రభావితమైన తాడేపల్లిగూడెం ప్రాంతంలో రానున్న 24 నుంచి 48 గంటల్లో పొలాల్లో నిలిచిన నీటిని వేగంగా బయటకు పంపగలిగితే పంట నష్టాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో నీటి తొలగింపు చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ముంపునకు గురైన పొలాల్లో నీరు తగ్గిన వెంటనే పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేసి, వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ క్షేత్రస్థాయి సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రైతులకు పంటల సంరక్షణకు సంబంధించిన వ్యవసాయ యాజమాన్య సలహాలను ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా



రైతులకు పంటల సంరక్షణ, ముంపు అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు నిరంతరం చేరవేయాలని ఆదేశించారు.పొలాల్లో నిలిచిన నీరు త్వరగా బయటకు వెళ్లేలా అవసరమైన చోట్ల అంతర్గత డ్రైనేజీ మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు తెలిపారు.ముంపు పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందకుండా వారికి అవసరమైన సాంకేతిక సూచనలు, వ్యవసాయ సలహాలు అందిస్తూ, పంట నష్టం తగ్గించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సమన్వయంతో చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ సమీక్షలో డీఆర్ఓ, ఆర్డీఓలు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బధిరుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకారం





**జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ**

**విజయవాడ: బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 26 నంది పత్రిక** జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ బధిరుల దినోత్సవం మరియు సంజ్ఞల భాషా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా స్థాయి కార్యక్రమాన్ని శనివారం విజయవాడలోని ఫార్మర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ, బధిరులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బధిరులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఎటువంటి సంకోచం చెందాల్సిన అవసరం లేదని, వారి అవసరాలు, సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు తాము అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. బధిరులు సమాజంలో సమాన అవకాశాలతో ముందుకు సాగేందుకు అవసరమైన సహాయాన్ని అందించడంతో పాటు, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ జిల్లా స్థాయి కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని వివిధ బధిరుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు మరియు డెఫ్ ఎనేబుల్ ఇండియా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది బధిరులు ఈ కార్యక్రమానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో భాగంగా బధిరుల ప్రతిభను ప్రోత్సహించే విధంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఇద్దరు బధిరులకు టచ్ ఫోన్లు, ఐదుగురికి వినికిడి యంత్రాలు వెరసి రూ.50,000/- విలువ చేసే ఉపకరణాలు అందిచడమైనది.

ఈ కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వాడ్రేవు కామరాజు, జిల్లా అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ ప్రతినిధులు, పాఠశాలల సిబ్బంది, బధిరుల సంఘాల ప్రతినిధులు, ఇన్సైట్ ఇండియా సంస్థ ప్రతినిధులు, పలువురు ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. బధిరుల సంక్షేమం, వారి హక్కులు, అవసరమైన సహాయ సహకారాలపై కార్యక్రమంలో అవగాహన కల్పించారు..

# మాజీ ప్రధాని డా. మన్మోహన్ సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు





**కడప, సెప్టెంబర్ 26, 2026:** కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధానమంత్రి, ఆర్థికవేత్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లిడా. మన్మోహన్ సింగ్ జయంతి వేడుకలనులి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు లిశ్రీమతి ఎన్.డి. విజయ జ్యోతిలి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా డా. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి శ్రీమతి ఎన్.డి. విజయ జ్యోతి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయన సేవలను స్మరించుకున్నారు. డా. మన్మోహన్ సింగ్ 1932 సెప్టెంబర్ 26న పంజాబ్‌లో జన్మించారు. ఆయన ఉన్నత విద్యను అభ్యసించి లికేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలి నుంచి ఆర్థికశాస్త్రంలో ఉన్నత విద్యను, లిఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలి నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను పొందారు. భారత ఆర్థిక వ్యవస్థపై విశేష పరిజ్ఞానం కలిగిన ఆయన ఆర్థికవేత్తగా, పరిపాలకుడిగా దేశానికి సేవలందించారు.

కేంద్ర ప్రభుత్వంలో వివిధ కీలక బాధ్యతలు నిర్వహించిన డా. మన్మోహన్ సింగ్ లి1991లో కేంద్ర ఆర్థిక మంత్రిగాలి బాధ్యతలు స్వీకరించారు. ఆ సమయంలో భారతదేశంలో చేపట్టిన ఆర్థిక సంస్కరణల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. అనంతరం రాజ్యసభ సభ్యుడిగా దీర్ఘకాలం కొనసాగారు. 2004 నుంచి 2014 వరకు రెండు పర్యాయాలు భారత ప్రధానమంత్రిగాలి పనిచేసిన డా. మన్మోహన్ సింగ్ దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించారు. ఆయన నిరాడంబరత, నిబద్ధత, ఆర్థిక పరిజ్ఞానం, ప్రజాసేవకు కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొని డా. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే: ఈసీ ప్రెస్ నోట్‌పై కాంగ్రెస్ ఫైర్



భారత ఎన్నికల సంఘం (జుజ×) తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనపై విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా సవరణ (గా×=) పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే భారీ కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఈ సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ శనివారం గట్టిగా పట్టుబట్టింది. ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, ఈసీఐ నేడు ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఈ వివరణ కాంగ్రెస్ ఆగ్రహాన్ని మరింత పెంచింది. ఈసీఐ ఇప్పుడు ఆత్మరక్షణలో పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ జైరాం రమేశ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వరుస పోస్టులతో ఈసీఐని, సీఈసీని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు."మీడియా కథనాల్లో వచ్చిన ఆరోపణలను ఈసీఐ తన ప్రెస్ నోట్‌లో ఎక్కడా నేరుగా ఖండించలేదు. వాటి తీవ్రతను తగ్గించే ప్రయత్నం మాత్రమే చేసింది. గోవా విషయంలో తప్పు చేసి దొరికిపోయాక, తొలగించిన 97 మందిలో 81 మంది పేర్లను తిరిగి చేర్చామని సిగ్గులేకుండా చెబుతోంది. అంటే, మొదట ఓటర్ల హక్కును కాలరాసి, దొరికిపోయాక మళ్లీ వారి పేర్లను చేర్చుతున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసం?" అని జైరాం రమేశ్ ప్రశ్నించారు.ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఓటరు నమోదు గడువును పొడిగించిన ఈసీఐ.. కర్ణాటక, తెలంగాణ, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అన్యాయంగా ఓటు హక్కు కోల్పోయిన వారి పరిస్థితి ఏంటని నిలదీశారు. కేవలం ఒక వ్యక్తి అవినీతి వల్ల ఓటు హక్కు కోల్పోయిన ఈ రాష్ట్రాల ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఈసీఐకి లేదా అని ఆయన అన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఐఐటీ/ట్రిపుల్ ఐటీ నిపుణులతో ఈసీనెట్ పోర్టల్‌ను సమీక్షిస్తామని చెప్పడం, సమస్య ఉందని అంగీకరించడమేనని జైరాం రమేశ్ పేర్కొన్నారు. సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు, ప్రతిపక్షాలపై ద్వేషం, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం, ముఖ్యంగా యువ ఓటర్లను (జెన్ ్గ) లక్ష్యంగా చేసుకోవడం వంటి అంశాలు ఆయన అవినీతిని బయటపెట్టాయని ఆరోపించారు. ఫారం 6లో పార్లమెంటు ఆమోదం లేకుండా మార్పులు చేసి, యువత ఓటు నమోదు చేసుకోకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.సీఈసీ బ్యూరోక్రసీ ముసుగులో దాక్కోవాలని చూస్తున్నారని, కానీ ఆయన బండారం బట్టబయలైందని జైరాం రమేశ్ అన్నారు. దేశమంతా ఆయనను జవాబుదారీ చేయాలని చూస్తోందని, ఈ నేపథ్యంలో సీఈసీ రాజీనామా లేదా ఆయనపై విచారణ జరపడం మినహా మరో మార్గం లేదని స్పష్టం చేశారు.

## డ్రైనేజ్ పంపింగ్ స్టేషన్ పునరుద్ధరణ పనులు.. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 26 నంది పత్రిక** విజయవాడ నగరంలోని వెటర్నరీ కాలనీ నుంచి ఆటోనగర్ ఎస్టీపీకి మురుగునీటిని తరలించే డ్రైనేజ్ పంపింగ్ స్టేషన్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యను పునరుద్ధరించేందుకు తాత్కాలికంగా పంపింగ్ స్టేషన్‌ను నిలిపివేసి మరమ్మతు పనులు చేపడుతున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.డ్రైనేజ్ పంపింగ్ స్టేషన్‌ను తాత్కాలికంగా నిలిపివేయడం వల్ల బ్యాక్ ఫ్లో కారణంగా వెంకటేశ్వరరావు నగర్, ఈఎస్ఐ హాస్పిటల్ జంక్షన్, వెటర్నరీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పొంగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు.కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లో గల్పర్లను ఏర్పాటు చేసి, మురుగునీరు బయటకు ప్రవహించకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇంజనీరింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మురుగునీటిని గల్పర్ల సహాయంతో నియంత్రించే చర్యలు చేపడుతున్నారని తెలిపారు.డ్రైనేజ్ పంపింగ్ స్టేషన్ పునరుద్ధరణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు సిబ్బంది చర్యలు చేపడుతున్నారని, సుమారు 24 గంటల సమయం పట్టే అవకాశం ఉందని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. పనులు పూర్తయ్యే వరకు సంబంధిత ప్రాంతాల ప్రజలు నగరపాలక సంస్థకు సహకరించాలని ఆయన కోరారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకునేలా ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారు.

## ఎన్ డి ఏ కూటమి ఐక్యతే మా లక్ష్యం

**అన్ని స్థానాల్లో విజయమే ధ్యేయం**

**ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ**

**కూటమి పార్టీల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ**



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 26 నంది పత్రిక** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి పార్టీల మధ్య సమన్వయం, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పరస్పరం ఆత్మీయంగా కలుసుకుని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. కూటమి పార్టీల మధ్య సమన్వయంతో ముందుకు సాగుతూ క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను మరింత పటిష్టం చేయడం, నాయకులు, కార్యకర్తల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు.స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామ, మండల, పట్టణ స్థాయిల్లో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై నాయకులు అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టాలని చర్చించినట్లు తెలిపారు వైసిపి పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు మళ్లీ పునరావృతం కాకుండా ప్రజలకు మెరుగైన పాలన అందించాలని మా లక్ష్యం అని ఎన్డీఏ కూటమి నాయకులం అందరూ ఐక్యంగా పనిచేస్తూ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ ముందుకు తీసుకెళ్తామన్నారు . ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారానికి సంబంధించిన సమావేశంలో చర్చించడం జరిగింది గతంలో ఇతర నాయకులకు ఇచ్చిన హామీల కారణంగా కొంత ఆలస్యం జరిగింది అయితే సంబంధిత కుటుంబానికి న్యాయం చేస్తామని పార్టీ నాయకత్వం హామీ ఇచ్చింది త్వరలోనే ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రమాణ స్వీకారం జరిగేలా తీసుకుంటామన్నారు పార్టీ ఆళ్లగడ్డ నుంచి ప్రజలకు కార్యకర్తలకు ఒకటే భరోసా ఇస్తున్నా కూటమిలో ఎలాంటి విభేదాలు లేకుండా అందరం కలిసి పని చేస్తాం రాబోయే ఎన్నికల్లో ఐక్యంగా పోటీ చేసి విజయం సాధించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు.ఈ సమావేశంలో జిల్లా పరిశీలకులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, డోన్ కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, జనసేన కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ యనమలతో పాటు కూటమి పార్టీల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



## నూతన వస్త్ర ఫలపుష్పాలంకరణ

వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో ఖానాపూరం మండలం ధర్మారావుపేట గ్రామానికి చెందిన గడ్డం అశోక్ పూల దంపతుల కూతురు కీర్తన నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ ముంజాల రాజేందర్ గౌడ్ లు పాల్గొని చిన్నారి కీర్తన ను నిండు నూరేండ్లు సుఖసంతోషాలతో చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు రామగిరి యాదగిరి స్వామి, సురేష్ గౌడ్, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌ను ఏవియేషన్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి లక్ష్యం








**కర్నూలు జిల్లాను ఏవియేషన్, డ్రోన్ రంగాల కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నాం**


**కర్నూలును దేశంలోని బలమైన ఏవియేషన్ హబ్‌లలో ఒకటిగా తీర్చిదిద్దేందుకు కృషి**

**గ్రామీణ ప్రాంతాలకు ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం**

**దేశవ్యాప్తంగా ఎఫ్‌టీఓల సంఖ్య, శిక్షణ ప్రమాణాలు పెంచేందుకు చర్యలు**

**కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**

**నంది పత్రిక కర్నూలు బ్యూరో** : ఆంధ్రప్రదేశ్‌ను ఏవియేషన్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి లక్ష్యం అని, కర్నూలు జిల్లాను ఏవియేషన్, డ్రోన్, పారిశ్రామిక రంగాలకు కీలక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. శనివారం కర్నూలు ఎయిర్పోర్ట్ లో ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీఓ)ను కర్నూలులో ఏర్పాటు చేయడం చారిత్రాత్మక పరిణామమన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఏవియేషన్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలిపారు.. కేవలం విమానాశ్రయాల నిర్మాణమే కాకుండా, శిక్షణ, నిర్వహణ, గ్రౌండ్ ఆపరేషన్స్, విమానాశ్రయ నిర్వహణ తదితర అన్ని విభాగాలతో కూడిన ఏవియేషన్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కర్నూలులో హిందుస్థాన్ గ్రూప్‌కు చెందిన ఓరియంట్ ఫ్లయింగ్ అకాడమీ కావడం రాష్ట్రంలోనే తొలి ఎఫ్‌టీఓగా ప్రత్యేకత సంతరించుకుందని పేర్కొన్నారు. దేశీయ విమానయాన రంగంలో గణనీయమైన వృద్ధి సాధించామని మంత్రి పేర్కొన్నారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య సుమారు 166కు చేరిందన్నారు. విమానాశ్రయాలు, విమానాలు, విమాన ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు. ఈ విస్తరిస్తున్న ఏవియేషన్ రంగానికి అవసరమైన మానవ వనరులను సిద్ధం చేయడంలో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ల పాత్ర కీలకమన్నారు.. దేశవ్యాప్తంగా ఎఫ్‌టీఓల సంఖ్యను, సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. కర్నూలు ప్రాంతానికి వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యత ఉందని మంత్రి తెలిపారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సమీపంలో ఉండటం వల్ల కర్నూలు ఏవియేషన్ కార్యకలాపాలకు అనుకూలమైన ప్రాంతమన్నారు. ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న విమానాశ్రయం ఉండటం ఎఫ్‌టీఓకు అదనపు ప్రయోజనమని మంత్రి తెలిపారు. దేశంలోని కొన్ని ఎఫ్‌టీఓలు పరిమిత సౌకర్యాలు కలిగిన చిన్న ల్యాండింగ్ స్ట్రిప్‌లపై ఆధారపడుతున్నాయని, కర్నూలులో మాత్రం పూర్తి స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న విమానాశ్రయంతో పాటు ఎఫ్‌టీఓ కూడా అందుబాటులోకి రావడం శిక్షణ పొందే వారికి ఎంతో ప్రయోజనకరమన్నారు..కర్నూలులో ఏడాది పొడవునా అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఉండటం వల్ల పైలట్ శిక్షణకు మరింత అనుకూలత ఏర్పడుతుందని మంత్రి పేర్కొన్నారు.. కర్నూలులో ఏర్పాటు చేసిన ఎఫ్ టి ఓ ల అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఎఫ్ టి ఓ లో 3 విమానాలు ఉన్నాయని, వీలైనంత త్వరగా వాటి సంఖ్యను 10కి పెంచి, కర్నూలును దేశంలోని బలమైన విమానయాన హబ్‌లలో ఒకటిగా తీర్చిదిద్దాలని మంత్రి ఆకాంక్షించారు.కర్నూలు విమానాశ్రయం రాయలసీమ ప్రాంతంలో అనేక అభివృద్ధి అవకాశాలకు దోహదపడుతోందన్నారు. కర్నూలు కేంద్రంగా పారిశ్రామిక, తయారీ, ఏవియేషన్ రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. కియా మాన్యుఫాక్చరింగ్ యూనిట్, బుల్లెట్ రాయల్ ఎన్ఫీల్డ్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్, డిఫెన్స్ ఎయిర్ క్రాఫ్ట్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ తదితర సంస్థల కార్యకలాపాలతో పాటు ఫ్లైట్ ట్రైనింగ్ అకాడమీ కూడా రావడం ద్వారా రాయలసీమలో విస్తృతమైన ఎకోసిస్టమ్ ఏర్పడుతోందన్నారు.. కర్నూలులో ఎఫ్‌టీఓ ద్వారా ఏడాదికి 60 మందికి శిక్షణ అందించే సామర్థ్యం ఏర్పడటంతో పాటు ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, గ్రౌండ్ ఆపరేషన్స్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయన్నారు.కర్నూలులో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీ గురించి మంత్రి మాట్లాడుతూ, భవిష్యత్తులో డ్రోన్ల వినియోగం మరింత విస్తరించనుందని మంత్రి తెలిపారు. రక్షణ రంగంతో పాటు వ్యవసాయం, వాణిజ్యం, శాంతిభద్రతలు, భూ సర్వేలు, గ్రౌండ్ సర్వైలెన్స్ తదితర అనేక రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరుగుతోందన్నారు.. కర్నూలులో డ్రోన్ సిటీకి అనుగుణంగా డీజీసీఏ కార్యకలాపాలను మరింత విస్తరించాలన్న రాష్ట్ర మంత్రి టి.జి.భరత్ విజ్ఞప్తిపై స్పందిస్తూ, కర్నూలులో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి డ్రోన్ల నాణ్యతా పరీక్షలు, ధృవీకరణ వంటి కార్యకలాపాలను స్థానికంగానే నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. దేశంలో కార్యకలాపాలను కేవలం ఢిల్లీ చుట్టూ కేంద్రీకరించకుండా ప్రాంతీయంగా వికేంద్రీకరించాల్సిన అవసరం ఉందన్నారు. కర్నూలులో ఇప్పటికే వాణిజ్య విమాన కార్యకలాపాలు జరుగుతున్నాయని, తాజాగా ఎఫ్‌టీఓ కార్యకలాపాలు ప్రారంభమవుతున్నాయని, డ్రోన్ పరీక్షలకు కూడా విమానాశ్రయం అనుకూల వేదికగా మారుతుందన్నారు. దేశంలో తయారీ, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను పెంచడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని మంత్రి తెలిపారు. దేశ యువతలో అపారమైన ప్రతిభ, ఆశయాలు ఉన్నాయని, వారికి అవసరమైన విద్య, శిక్షణ, అవకాశాలను అందించడం ద్వారా ఏవియేషన్‌తో పాటు అనేక రంగాల్లో దేశం మరింత అభివృద్ధి సాధించగలదని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా వివిధ రంగాల వ్యవస్థల సమన్వయంతో కర్నూలు అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా రూపుదిద్దుకుంటోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి తెలిపారు. ఎఫ్ టి ఓ లను పెద్ద నగరాలకే పరిమితం చేయకుండా గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం సుమారు 36 ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్లు ఉన్నాయని, భవిష్యత్ అవసరాలకు ఈ సంఖ్య సరిపోదని మంత్రి పేర్కొన్నారు. విమానయాన రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో పైలట్లకు డిమాండ్ గణనీయంగా పెరగనుందని మంత్రి తెలిపారు. దేశంలో విమానాల ఆర్డర్లు సుమారు 1,600కు చేరుకున్నాయని, ఒక్కో విమానానికి కనీసం 20 నుంచి 30 మంది పైలట్లు అవసరమయ్యే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. దీంతో రానున్న 1015 ఏళ్లలో దేశానికి సుమారు 25,000 నుంచి 30,000 మంది పైలట్లు అవసరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని కేంద్ర మంత్రి వివరించారు.భారతీయ విద్యార్థులు పైలట్ శిక్షణ కోసం విదేశాలకు వెళ్లి శిక్షణ పొంది తిరిగి రావాల్సిన అవసరం లేకుండా, దేశంలోనే వారికి అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ అందించాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా మరిన్ని ఎఫ్‌టీఓలను ఏర్పాటు చేసేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.. ఇటీవల దేశవ్యాప్తంగా 11 ఎఫ్‌టీఓలకు అనుమతులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో విమానయాన శిక్షణ రంగంలో పోటీ, అవకాశాలు మరింత పెరగనున్నాయని, కర్నూలులో మరో ఎఫ్‌టీఓ రానుందని, కడపలో రెండు ఎఫ్‌టీఓలకు అనుమతులు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. రాజమండ్రిలో ఇప్పటికే ఒక ఎఫ్‌టీఓకు భూమిపూజ జరిగిందని, మరో ఎఫ్‌టీఓ కూడా రానుందని చెప్పారు. భోగాపురం సైతం ఎఫ్‌టీఓలకు ఆకర్షణీయమైన ప్రాంతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అనేక ఎఫ్‌టీఓలు ఏర్పాటవడం ద్వారా క్లస్టర్ ఇకోసిస్టమ్ అభివృద్ధి చెందుతుందన్నారు. కర్నూలు, కడప వంటి ప్రాంతాల్లోని ఎఫ్‌టీఓల మధ్య శిక్షణ విమానాలు, పైలట్లు, ట్రైనర్ల అనుభవాల పరస్పర మార్పిడికి అవకాశం ఏర్పడి, శిక్షణ ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు.. పైలట్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రత్యేక జాతీయ స్థాయి గ్రాడ్యుయేషన్ సెరెమనీ నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు.దేశంలోని ఎఫ్‌టీఓల ప్రమాణాలు, నిర్వహణ, శిక్షణ నాణ్యతను మెరుగుపరిచేందుకు ర్యాంకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులు ఎఫ్‌టీఓలను ఎంపిక చేసుకునే సమయంలో వాటి సౌకర్యాలు, శిక్షణ ప్రమాణాలు, పనితీరు తదితర అంశాలపై స్పష్టమైన సమాచారం అందించడమే ఈ ర్యాంకింగ్ విధానం ఉద్దేశమన్నారు.. మొదటిసారి ర్యాంకింగ్ నిర్వహించినప్పుడు కేవలం ఒక ఎఫ్‌టీఓ మాత్రమే 'ఏ' ర్యాంక్ సాధించిందని, ఆ తర్వాత ర్యాంకింగ్ విధానం అమలుతో ఎఫ్‌టీఓలు తమ నిర్వహణ, శిక్షణ ప్రమాణాలపై మరింత దృష్టి సారించాయని తెలిపారు. ఆరు నెలల వ్యవధిలో 13 ఎఫ్‌టీఓలు 'ఏ' ర్యాంక్, ఒక ఎఫ్‌టీఓ 'ఏ+' ర్యాంక్ సాధించాయని మంత్రి వెల్లడించారు. కర్నూలులో ఏర్పాటవుతున్న ఎఫ్‌టీఓలు ప్రారంభం నుంచే 'ఏ' గ్రేడ్ ప్రమాణాలను లక్ష్యంగా చేసుకుని పనిచేయాలని మంత్రి సూచించారు. ఆధునిక సాంకేతికతతో రూపొందుతున్న కొత్త శిక్షణ విమానాలను ఎఫ్‌టీఓలు, విద్యార్థి పైలట్లు వినియోగించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.దేశీయంగా తయారవుతున్న 'హన్స ఎన్‌జీ ' విమానాన్ని కూడా పైలట్ శిక్షణ రంగంలో వినియోగించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని, ఫుర్సత్‌గంజ్‌లోని ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీకి ఈ ఆధునిక భారతీయ ట్రైనర్ విమానాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు.. ఎఫ్‌టీఓలకు ఆధునిక ట్రైనర్ విమానాల వినియోగంలో అవసరమైన మద్దతు అందించేందుకు మంత్రిత్వ శాఖ చర్యలు పరిశీలిస్తోందని, ఈ అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.దేశంలో ప్రస్తుతం 166 విమానాశ్రయాలు అందుబాటులో ఉన్నాయని, దేశవ్యాప్తంగా విమానాశ్రయాల విస్తరణ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూ కాశ్మీర్, అండమాన్, లక్షద్వీప్ తదితర ప్రాంతాల్లోనూ విమానయాన మౌలిక వసతులు అభివృద్ధి చెందుతున్నాయన్నారు.. రాబోయే 10 సంవత్సరాల్లో దేశంలో మరో 100 విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే క్రమంలో దేశంలో 350కి పైగా విమానాశ్రయాలు ఉండేలా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.. విమానయాన రంగం విస్తరిస్తున్న కొద్దీ పైలట్లు, ఏవియేషన్ ఇంజనీర్లు, టెక్నీషియన్లు, ఇతర నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరం మరింత పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ఎఫ్టిఓ ల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తమ కోర్సులను అత్యుత్తమ ప్రతిభతో పూర్తి చేసి, భవిష్యత్ విమానయాన రంగానికి నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. భారత విమానయాన వ్యవస్థను ప్రపంచంలోని అత్యుత్తమ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు.భోగాపురం విమానాశ్రయాన్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని, విజయవాడ, కడప, రాజమండ్రి విమానాశ్రయాల్లో కొత్త టెర్మినల్ భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టామని తెలిపారు. కుప్పం, నెల్లూరు, శ్రీకాకుళం, అమరావతి, నాగార్జునసాగర్ ప్రాంతాల్లో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు కూడా వేగంగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. భోగాపురంలో 139 ఎకరాల్లో ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ప్రపంచస్థాయి ఏవియేషన్ విద్యా సంస్థను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావాలనే లక్ష్యంతో అధికారిక ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి పేర్కొన్నారు. ఒకవైపు విమానాశ్రయాలు, మరోవైపు శిక్షణా సంస్థలు, యూనివర్సిటీలు, ఇతర అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రంలో సమగ్ర ఏవియేషన్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు.కర్నూలు విమానాశ్రయంలో విమాన సర్వీసుల సమయాలు, కనెక్టివిటీ పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మంత్రి తెలిపారు. మరిన్ని విమాన సర్వీసులు అందుబాటులోకి తీసుకురావడానికి విమానయాన సంస్థలతో చర్చించి చర్యలు చేపడతామని వెల్లడించారు. కర్నూలు విమానాశ్రయంలో నైట్ ల్యాండింగ్ సదుపాయం కల్పించే అంశంపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నైట్ ల్యాండింగ్ సదుపాయం అందుబాటులోకి వస్తే విమానాశ్రయ కార్యకలాపాల సమయాన్ని మరింత విస్తరించి, తద్వారా కర్నూలుకు అదనపు విమాన కనెక్టివిటీ కల్పించే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు ఎయిర్పోర్ట్ లో రాష్ట్రంలోనే మొట్టమొదటి ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కావడం కర్నూలు జిల్లా ప్రజలకు, రాష్ట్ర యువతకు ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. కర్నూలు విమానాశ్రయం నిర్మాణానికి 2017లో శంకుస్థాపన చేసి, తక్కువ వ్యవధిలోనే విమానాశ్రయాన్ని ప్రారంభించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం అదే విమానాశ్రయంలో ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. ఏవియేషన్ రంగంలో భవిష్యత్తులో నిపుణులైన సిబ్బందికి, పైలట్లకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల విద్యార్థులతో పాటు కర్నూలు జిల్లా యువతకు కూడా విమానయాన రంగంలో శిక్షణ పొందే అవకాశం లభిస్తుందన్నారు. విమానాశ్రయం అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. శ్రీకాకుళం, అమరావతి, కుప్పం తదితర ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా ప్రజలకు ప్రయాణ సమయం తగ్గడంతో పాటు వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందన్నారు. కర్నూలు విమానాశ్రయం ఏర్పాటుతో ఈ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి మరింత అవకాశం ఏర్పడిందని మంత్రి తెలిపారు. విమానాశ్రయం, రహదారులు, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉండటంతో అనేక పరిశ్రమలు ఓర్వకల్లు ప్రాంతం వైపు ఆకర్షితమవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేయడం జరుగుతోందని, తొలి దశలో 180 ఎకరాల్లో, రెండో దశలో 400 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. డ్రోన్ రంగానికి సంబంధించిన కార్యక్రమాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయన్నారు.. అదే విధంగా మరిన్ని ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌టీఓ) ఏర్పాటు చేసేందుకు కొన్ని సంస్థలు ముందుకు వస్తున్నాయని, వాటికి అవసరమైన అనుమతులు కల్పించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు. స్థానిక యువతకు వీలైనన్ని ఎక్కువ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి ఓరియంట్ ఏవియేషన్ సంస్థ ప్రతినిధులను కోరారు. ఏవియేషన్, పారిశ్రామిక రంగాలకు కీలక కేంద్రంగా అభివృద్ధి చెందేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లోకి మరిన్ని పరిశ్రమలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాయలసీమలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు, పారిశ్రామికవేత్తలు గమనించాలని మంత్రి కోరారు. నీటి వనరులు, మౌలిక వసతులు, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధితో ప్రాంతం మరింత పురోగతి సాధిస్తుందని మంత్రి తెలిపారు. ఓర్వకల్లు ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు స్థానిక ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు సహకరించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఓరియంట్ ఏవియేషన్ సంస్థకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో విమానయాన రంగం అభివృద్ధితో పాటు పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కర్నూలులో ఓరియంట్ ఫ్లైట్ ఏవియేషన్ అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా ఇలాంటి శిక్షణ కేంద్రం ఏర్పాటు కావడం ప్రత్యేకమన్నారు. . కర్నూలు విమానాశ్రయ అభివృద్ధి, విమాన సర్వీసుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో ఓరియంట్ సంస్థ మరిన్ని విభాగాలను విస్తరించే ఆలోచన ఉంటే కర్నూలును కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కర్నూలులో ఇప్పటికే విమాన సౌకర్యం అందుబాటులో ఉన్నందున, భవిష్యత్‌లో సంస్థ మరిన్ని ప్రాజెక్టులు, శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని మంత్రి తెలిపారు. కర్నూలులో విమానయాన రంగం అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు అనేక అవకాశాలు ఉన్నాయి. అడుగడుగునా మౌలిక వసతులను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగితే కర్నూలు మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి పేర్కొన్నారు. ఓరియంట్ ఫ్లైట్ ఏవియేషన్ అకాడమీ ఏర్పాటు కర్నూలు యువతకు గొప్ప అవకాశమని మంత్రి పేర్కొన్నారు. పైలట్ శిక్షణ పూర్తిచేసుకున్న అనంతరం దేశ, విదేశాల్లో మంచి ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. వైద్యులు, ఇంజనీర్లు వంటి సంప్రదాయ వృత్తులతో పాటు విమానయాన రంగంలో కూడా స్థానిక యువతకు మంచి కెరీర్ అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. కర్నూలువిజయవాడ మధ్య ప్రస్తుతం ఉన్న విమాన సర్వీసుల ఫ్రీక్వెన్సీని పెంచి, ఉదయంసాయంత్రం రోజువారీగా విమాన రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కేంద్ర మంత్రిని కోరారు. కర్నూలు జిల్లాకు చెందిన పలువురు విజయవాడకు ప్రయాణించే నేపథ్యంలో రోజువారీ విమాన సర్వీసులు అందుబాటులో ఉంటే ప్రజలకు, ముఖ్యంగా వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని మంత్రి తెలిపారు.అదే విధంగా కర్నూలు విమానాశ్రయంలో రాత్రి ల్యాండింగ్ సౌకర్యాన్ని మరింత అభివృద్ధి చేయడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రన్‌వే సామర్థ్యాన్ని పెంచే అవకాశాలను పరిశీలించాలని కోరారు. కర్నూలు విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో ఎంఆర్ఓ సదుపాయాలు ఏర్పాటు చేయడానికి అవకాశాలను పరిశీలించాలని మంత్రి కోరారు. విమానాశ్రయానికి సమీపంలో విమానాల నిర్వహణ, పార్కింగ్ తదితర సదుపాయాలు అభివృద్ధి చేస్తే భవిష్యత్‌లో స్థానికంగా వ్యాపార, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు.. అదే విధంగా డ్రోన్లు, చిన్న తరహా విమానాల తయారీకి సంబంధించిన పరిశ్రమలు కర్నూలులో ఏర్పాటయ్యే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కర్నూలు జిల్లాలో ఇప్పటికే పలు పరిశ్రమలకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడులు వస్తున్నాయని, భవిష్యత్‌లో పరిశ్రమల కార్యకలాపాలు పెరిగే కొద్దీ విమాన ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. కాబట్టి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని విమానాశ్రయ మౌలిక వసతులను ఇప్పటి నుంచే బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కర్నూలులో డీజీసీఏకు సంబంధించిన ప్రాంతీయ/ఉప ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా పరిశీలించాలని మంత్రి భరత్ కోరారు. జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ కర్నూలు ఎయిర్పోర్ట్ లో ఓరియంట్ ఫ్లైట్ ఏవియేషన్ అకాడమీని ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. అకాడమీ ఏర్పాటుకు యాజమాన్యం సుమారు రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టినట్లు కలెక్టర్ తెలిపారు. డీజీసీఏ నుంచి అనుమతి పొందిన తొలి ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌గా ఓరియంట్ ఫ్లైట్ ఏవియేషన్ అకాడమీ ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. అకాడమీ డైరెక్టర్, యాజమాన్యానికి ఈ సందర్భంగా కలెక్టర్ అభినందనలు తెలిపారు. అకాడమీలో శిక్షణ పొందుతున్న పైలట్ ట్రైనీలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, శిక్షణ కార్యక్రమాలను అన్ని భద్రతా ప్రమాణాలు, జాగ్రత్తలను పాటిస్తూ విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ మధుసూదన శర్మ, ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ చైర్మన్ డా.ఆనంద్ జాకబ్ వర్గీస్, డైరెక్టర్ డా.అశోక్ వర్గీస్, కర్నూలు ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగార్, సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థల ప్రతినిధులు అనురాగ్ స్వామినాథన్, అనూప్, సెయింట్ జోసెఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఐశ్వర్య, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com